

• కొల్లేరుకు విదేశీ చుట్టాలు..

కొల్లేరు సరస్సులో విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. ఏటా శీతాకాలంలో కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీర ప్రాంతాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి కొల్లేరుకు వలస వస్తాయి. వీటిని చూసేందుకు పర్యాటకులను ఆసక్తి కనబరుస్తారు.

6





శ్రీవారి దర్శనార్థం వైకుంఠం కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

## భక్తజన సంద్రం.. చినవెంకన్న క్షేత్రం



ద్వారకాతిరుమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం మారుమోగింది. కార్తీకమాసంలో రెండో ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. దాదాపు 20వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో శ్రీవారి దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది.




కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న 104 ఉద్యోగులు

## మా సమస్యలు పరిష్కరించండి..

### కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగుల ధర్నా

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఉద్యో గులు ఆదివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిం చారు. పనిదినాల్లో యాజమాన్యం సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం వల్ల ఆదివారం అయినప్పటికీ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. 104 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ వాటా చెల్లించాలని నినాదాలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్ మాట్లాడుతూ 104 సర్వీసులు నిర్వహిస్తున్న ప్రైవేట్ ఏజన్సీలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ వాటా కూడా ఉద్యోగులతో కట్టించటం దుర్మార్గం అన్నారు. సీఎం ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భరత్, విజయ్, ప్రకాష్, విజయభూషణ్, ప్రసన్న కుమార్, ఎం.శాలిని, నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.


# నిధులపై ఆశలు




ఈసారైనా ప్రణాళికాబద్ధంగా పద్దులుంటాయా, ఐదేళ్లుగా చితికిపోయిన శాఖల్లో పనుల కోసం నిధుల కేటాయింపు జరుగబోతుందా, అందరూ ఆశించినట్టుగానే కూటమి ప్రభుత్వంలో సరికొత్తతనం కనిపించబోతుందా, కీలక శాఖలన్నింటికీ చేతినిండా పని, సమగ్ర నిధులు అందుబాటులోకి వస్తాయా..? నేటి నుంచి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అందరిలోను ఇదే ఉత్కంఠ.

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- బడ్జెట్ ప్రతిపాదనలపై రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేక భేటీ
- జిల్లాలోని ఎత్తిపోతలకు సమృద్ధిగా నిధులు కేటాయిస్తారా..
- కాల్వల ఆధునికీకరణ పనులకు జీవం పోస్తారా..
- కొల్లేరు పర్యాటకానికి నిధులు ఇవ్వబోతున్నారా..
- జల వనరులకు ఈసారి పెద్ద పీట

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలోనే వచ్చే ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలపై రాష్ట్ర మంత్రివర్గం సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ నేపథ్యంలోనే జిల్లాకు సంబంధించి పలు అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో మూలనపడ్డ తాడిపూడి, చింతలపూడి ఎత్తిపోతలకు జీవం పోస్తారా, కొల్లేరును పర్యాటకంగా తీర్చిదిద్దడమే కాకుండా రెగ్యులేటర్ల నిర్మాణానికి సమృద్ధిగా నిధులు కేటాయించబోతున్నారా, చాన్నాళ్లక్రితం నిలిచిపోయిన కాల్వల ఆధునికీకరణ పనులు తిరిగి ప్రారంభమయ్యేలా ప్రాణం పోయనున్నారా, పంటలకు, రైతులకు అనువుగా కీలక నిర్ణయాలు, కేటాయింపులు కనిపిస్తాయా.. అనే ప్రశ్నలే అందరి ముందు ఉన్నాయి. ఎలాగూ పోలవరం ప్రాజెక్టు పనులు ఇప్పటికే పుంజుకోవడానికి అనువైన పరిస్థితులకు ప్రభుత్వం అంకురార్పణ చేసింది. మిగతా పనులకు తగినంత నిధులు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారనే



భావనే అందరిలోను కనిపిస్తోంది. అందరూ మెచ్చేలా ఈసారి అసలుసిసలైన పద్దు అసెంబ్లీలోకి రానున్నట్టు ఎమ్మెల్యేలు గట్టి ధీమాతోనే ఉన్నారు. ఎన్నడో ఆరంభమైన తాడిపూడి ఎత్తిపోతలకు అవసరమైన నిధులు కేటాయింపులు గడిచిన ఐదేళ్లల్లోను చూసీచూడనట్టుగా అప్పటి ప్రభుత్వం వ్యవహరించింది. ప్రతీ బడ్జెట్‌లోను మొండి చెయ్యి చూపింది. 2007లో ఆరంభమైన తాడిపూడి ఎత్తిపోతల ఇప్పటికీ సంపూర్తి కాలేదు. పిల్ల కాల్వల తవ్వకానికి సరాసరిన 80 నుంచి 130 కోట్లు ఖర్చవుతాయని ఒక అంచనా వేశారు. ఇవన్నీ కలిస్తే 2 లక్షల 20 వేల ఎకరాలకు గోదావరి నీరు అందించడానికి వీలవుతుంది. ఈ బడ్జెట్‌లో ఎత్తిపోతలకు అవసరమైన నిధులు కొన్నింటికి కేటాయించే అవకాశం ఉంది.

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రెండుగా విభజించి తొలిదశ పనులన్నింటినీ రాబోయే రెండేళ్లల్లో పూర్తి చేయాలని ఇప్పటికే కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులు ప్రారంభించేకంటే ముందు ప్రత్యేకించి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు, మిగతా పనులన్నింటికీ దాదాపు 200 కోట్లు అవసరమని ఈ మధ్యనే ప్రతిపాదించారు. దీనికి అనుగుణంగానే తొలి దశ కోసం ఈ బడ్జెట్‌లోనే కేటాయిస్తారనే ఆశ అందరిలోను ఉంది. తమ్మిలేరు జలాశయం, ఎర్రకాల్వ జలాశయం ఆధునికీకరణ పనులు గడిచిన ఐదేళ్లలో ఆటంకాలు ఎదురయ్యాయి. నిధులు కేటాయింపులు లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. ఎత్తిపోతల దగ్గర నుంచి మధ్య తరహా ప్రాజెక్టుల వరకు నిధుల కొరత వెన్నాడడంతో ఇప్పటివరకు రైతులు నష్టపోవాల్సి వచ్చింది. జల వనరుల నిర్వహణే అంతటా అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత కీలక శాఖలన్నింటి పైనా దృష్టి పెట్టింది. ఈక్రమంలోనే జలవనరుల శాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ఇప్పటికే ప్రభుత్వం సక్సెస్ అయ్యింది. రాబోయే మూడేళ్లల్లో ఎట్టి పరిస్థితుల్లోను ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతా మనే సంకల్ప లక్ష్యం దిశగా సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నారు. పోలవరం పనులు పుంజు కోవడంతో అందరిలోను సంతృప్తి వ్యక్తమవు తోంది. దీంతో ఈసారి బడ్జెట్‌లో ఎత్తిపోతల పథకాలతో పాటు మిగతా తాగునీటి పథకాల న్నింటికీ సమృద్ధిగా నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు.

### ఆధునికీకరణ పనుల సంగతేంటి

2007లో ఆరంభమై 2019 వరకు సాగిన కాల్వల ఆధునికీకరణ పనులకు గడిచిన ఐదేళ్లల్లో గండిపడింది. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ పనులకు రూపాయి విదల్చలేదు. ఎక్కడికక్కడ లాకులు, మరమ్మతులు నిలిచిపోయాయి. కాల్వ శివారు భూములకు నీరందకుండా పోయింది. గోదావరి ప్రధాన కాల్వకు సంబంధించి అనేక పనులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. కృష్ణా కాల్వకు ఇదే తరహా దీనావస్థ. ఈసారి బడ్జెట్‌లో కాల్వ ఆధునికీకరణ పనులకు తగిన నిధులు కేటాయిస్తారని రైతులు ఆశతో ఉన్నారు.

### కొల్లేరు గతిమారుస్తారా..

కొల్లేరును పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ఇంతకుముందున్న ప్రతిపాదనలకు బడ్జెట్‌లో జీవం పోసారా అనే ఆశతోనే ఈ ప్రాంత ప్రజలు ఉన్నారు. ఎందుకంటే కొల్లేరు ప్రక్షాళన పూర్తయిన తర్వాత అక్కడి ప్రజలకు జీవనోపాధి నిమిత్తం పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ఎప్పుడో నిర్ణయించారు. కాని ఇప్పటివరకు ప్రతిపాదనలేవీ ఆచరణకు నోచుకోలేదు. కొల్లేరు అంతర్భాగంలోకి ఉప్పునీరు రాకుండా నిరోధించేందుకు వీలుగా రెగ్యులేటర్ నిర్మాణానికి ఈబడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. గత ప్రభుత్వంలో రెగ్యులేటర్ నిర్మాణానికి అంతా తామే చేస్తున్నట్టుగా హడావుడి చేశారే తప్ప పైసా విదల్చలేదు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని నిధులు కేటాయిస్తే కొల్లేరుకు జీవం పోసినట్టు అవుతుందని స్థానికులు భావిస్తున్నారు.

# అంతా శుభమే..

» అర్చకులకు వేతనం రూ.15 వేలకు పెంపు.. » జిల్లాలో 1500 మందికి పైగా ప్రయోజనం

- ఆలయాల్లో దీపదూప నైవేద్యాలకు ఇక రూ.10వేలు
- వేద విద్య నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3వేల భృతి
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం



ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతిమాట నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఆలయాల్లో పనిచేసే అర్చకులకు ఇటీవల సీఎం చంద్రబాబు శుభవార్త చెప్పారు. వారి వేతనాన్ని 50 శాతం పెంచడంతో పాటు ఆలయాల్లో దీపదూప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాలను రెట్టింపు చేశారు. ఈ క్రమంలో ఇచ్చిన హామీపై జీవో విడుదల అవ్వడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఆలయాల్లో పనిచేసే అర్చకులకు వేతనాలు, దీప దూప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాలను పెంచడంతో పాటు ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించి కమిటీల్లో బ్రాహ్మణులు, నాయిబ్రాహ్మణులకు చోటు కల్పించడం తదితర నిర్ణయాలు తీసుకు న్నారు. వైసీపీ పాలనలో ఆలయాల నిర్వహణను గాలికి వదిలేశారు. అర్చకులకు ఇచ్చే కనీస వేతనాలను సకాలంలో చెల్లించలేదు. దీప దూప నైవేద్యాలకు నిధులు విడుదల కాక పూజాది కైంకర్యాలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. వీటిని దృష్టిలో ఉంచుకుని కూటమి మేనిఫెస్టోలో వారి సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను పొందిపరిచి అమలుకు శ్రీకారం చుట్టారు. దూప దీపనైవేద్యాలకు కనీస ఆదాయం లేని ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనుంది. నెలకు రూ.5వేలు, ఆలయాల నిర్వహణకు అంది స్తారు. ఈ పథకం ద్వారా రూ.50 వేల లోపు ఆదాయం ఉన్న దేవాలయాలకు ప్రతినెలా అందిం చే మొత్తాన్ని ఐదు నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయం తీసుకు న్నారు. ఒకేసారి 100 శాతం పెంచడంతో ఆలయ నిర్వహణలో ఇక ఇబ్బందులు ఉండవని జిల్లాలోని వివిధ ఆలయాల్లో పనిచేసే అర్చకులు హర్షం ప్రకటించారు. 50 వేలకు పైగా ఆదాయం ఉన్న ఆలయాల్లో ప్రస్తుతం అర్చకులకు ప్రతి నెలా రూ.10 వేలు వేతనంగా ఇచ్చేవారు. దీన్ని రూ.15 వేలకు పెంచుతూ ఆదేశాలు తీసుకు న్నారు. జిల్లాలో సుమారు 1500 మందికి పైగా అర్చకులు ఈ పథకానికి అర్హులు అవుతారు. వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న వారికి ప్రతినెలా రూ.3వేలు భృతిగా అందిస్తారు.

### 156 ఆలయాలు ఎంపిక

ఇప్పటికే ఆదాయం లేని ఆలయాలకు దీపదూపనైవేద్య పథకం కింద నెలకు రూ.10వేలు చొప్పున అందిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం తక్కువగా ఉన్న చిన్న ఆలయాలను 6 (సీ-2) గుర్తించి అందులో పనిచేస్తున్న అర్చకులకు రూ.15వేలు చెల్లించే విధంగా జీవో ఎంఎస్ నెంబర్ 261ని జారీ చేసింది. జిల్లాలో 156 ఆలయాలకు ఈ పథకం వర్తింపజేస్తారు.

- ప్రకాశరావు, ఎండోమెంట్ ఏసీ

### అర్చకులకు పెరిగిన గౌరవం



ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆదాయం లేని చిన్న ఆలయాలకు పెద్ద ఊరట కల్పించే అంశం. గతంలో ఇస్తున్న దానికంటే మూడింతలు పెంచింది. ఆలయాల్లో దేదీప్యమానంగా ఏడాది మొత్తం ఇకనుండి చక్కగా పూజలు జరుగుతాయి. గతంలో రూ.6వేలు తీసుకునే అర్చకుడు ఇప్పుడు రూ.15 వేలు తీసుకోనున్నారు.

- కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు

### ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



రాష్ట్రంలో చిన్న దేవాలయాలకు ఆదాయం లేదు. దీనిని గుర్తించిన ప్రభుత్వం చేయూత ఇచ్చేందుకు కృషి చేయడం అభినందనీయం. చిన్న ఆలయాల్లో పనిచేస్తున్న పేద బ్రాహ్మణులను ప్రభుత్వం ఈ విధంగా ఆదుకోవడం సంతోషకరం. గత ఎన్నికల సమయంలో ఎన్‌డీయే కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు బ్రాహ్మణులకు ఆర్థికంగా చేయూత శుభపరిణామం.

- ఎం.బి.ఎస్ శర్మ, అఖిల భారతీయ బ్రాహ్మణ సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు

## పిట్టలను కాల్చే వాడిగా వచ్చి..

### బంగారం ఆశ చూపి రూ.20 లక్షలకు టోకరా

### మోసపోయిన ఆక్వా రైతు.. పోలీసులకు ఫిర్యాదు

ముదినేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు నికార్సయిన బంగారం ఆభరణాలు ఇస్తామని ఒక వ్యక్తి నుంచి కొందరు వ్యక్తులు రూ.20 లక్షలు కాజేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. నగదు తీసుకుని బంగారం ఇవ్వకపోగా, ఆ వ్యక్తిని భయపెట్టి, దాడికి పాల్పడి ఆ వ్యక్తులు పారిపోయారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లి మండలం చేవూరుపాలెంలో రొయ్యల చెరువు సాగు చేస్తున్న కృష్ణా జిల్లా పెదన మండలం చెన్నూరుకు చెందిన పండ్రాజు రవీంద్ర కుమార్ వద్దకు కొంతకాలం క్రితం మండవల్లి మండలం భైరవపట్నం నుంచి వచ్చానని చెప్పి తమిళనాడుకు చెందిన రాజేంద్ర అనే వ్యక్తి వచ్చాడు. తాను చెరువులపై పిట్టలను కాల్చే వ్యక్తిగా పరిచయం చేసుకున్నాడు. గతంలో కాల్వలు తవ్విన సందర్భంగా బయట పడి తమకు దొరికిన బంగారపు ఆభరణాలు ఉన్నాయని, తక్కువ ధరకు ఇస్తానని రవీంద్ర కుమార్‌కు తెలిపారు. అంతేకాక బంగారపు పెద్ద గొలుసు శాంపిల్ చూపించగా, దానిని గతనెల 23న సింగరాయపాలెంలో రవీంద్ర పరీక్ష చేయించగా మంచి బంగారమే అని తేలింది. దీంతో ఆ నగలను తిరిగి తీసుకుని రూ.20 లక్షలకు సరిపడ బంగారపు నగలు ఇస్తానని రాజేంద్ర తెలిపాడు. అతనికి రూ.5 లక్షలు అడ్వాన్సుగా రవీంద్ర ఇచ్చాడు. మిగిలిన రూ.15 లక్షల తెస్తే బంగారపు ఆభరణాలు ఇస్తామని తాము గుంటూరు సమీపంలో విజయవాడ - గుంటూరు హైవేలో ఫలానా చోట ఉంటామని రాజేంద్ర తెలిపాడు. ఈక్రమంలో గత నెల 24న అక్కడకు రవీంద్ర వెళ్లగా రాజేంద్రతో పాటు మరో ఇద్దరు వేరే చోటికి తీసుకుళ్లి రూ.15 లక్షలు తీసుకుని బంగారపు ఆభరణాలు ఇవ్వకుండా అతన్ని కొట్టి పరారయ్యారు. అప్పటి నుంచి సొమ్ములు కాజేసిన వ్యక్తుల ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఆదివారం రవీంద్ర కుమార్ ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి ఏఎస్ఐ పద్మజ దర్యాప్తు చేస్తున్నారు.

## నేటి జడ్పీ అత్యవసర సమావేశం రద్దు

### ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడమే కారణం

ఏలూరుసిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11వ తేదీన నిర్వహించాల్సిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశం రద్దు చేసినట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాప్రజా పరిషత్ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు ఆదివారం తెలిపారు. జిల్లాలో గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి రాజకీయ అజెండాతో సమావేశాలు నిర్వహించే అవకాశం లేకపోవడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి ఇటువంటి సమావేశాలు నిర్వహించకూడదని నిబంధనలు ఉండడంతో ఈనెల 11న నిర్వహించాల్సిన ఉమ్మడి జడ్పీ ప్రత్యేక సమావేశాన్ని రద్దు చేస్తున్నట్టు జడ్పీ సీఈవో సుబ్బారావు ప్రకటించారు. తిరిగి ఈ సమావేశం ఎప్పుడు ఏర్పాటు చేస్తారన్న విషయం త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.

## మహిళా రక్షణే ధ్యేయంగా..

### అవగాహన కల్పిస్తున్న అభయ మహిళా భద్రత బృందాలు

ఏలూరు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, చిన్నారులు, యువతులు రక్షణే ధ్యేయంగా అభయ మహిళా భద్రతా బృందం పని చేస్తుందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. అభయ మహిళా భద్రత కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మహిళా పోలీసు రక్షణ దళం పర్యటించింది. మహిళలకు, యువతులకు రక్షణ సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా మహిళలు ఆపదలో ఉంటే డయల్ 112గాని, 95503 51100కు సమాచారం అందించాలని 10 నిముషాల్లో పోలీసులు వస్తారని, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారి సమాచారాన్ని 1098 నంబర్‌కు అందించాలని తెలిపారు. అదే విధంగా ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930కు సమాచారం అందించాలన్నారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్లలో మహిళలకు అవగాహన కల్పించారు.



మహిళా భద్రతపై అవగాహన కల్పిస్తున్న అభయ మహిళా రక్షణ దళ పోలీసులు

### ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు..

## నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..

కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాలులో సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్

నేడు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్న కాకినాడ కలెక్టర్

7



ఎన్‌టీపీసీ ఎండీ సింగ్‌ను కలిసిన ఎంపీ మహేశ్

## నూజివీడు ట్రిపుల్ ఐటీకి రూ.12 కోట్లు ఇవ్వండి

ఏలూరుటూటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎన్‌టీపీసీ నుంచి 12 కోట్ల 17లక్షలు మంజూరు చేయాలని ఎంపీ మహేశ్ కుమార్ ఎన్‌టీపీసీ ఎండీ గురుదీప్ సింగ్‌ను కోరారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఎంపీ ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేశ్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ కళాశాలను తాను సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకున్నానన్నారు. అకడమిక్ లేబరేటరీ పాతకాలం నాటిదని ఇప్పుడు దాన్ని ఆధునీకరించడానికి రూ.12కోట్లు అవసరమన్నారు. ఆ నిధులు మంజూరు చేయాలని గురుదీప్‌సింగ్‌ను కోరినట్టు తెలిపారు.





## సండే సందడి

కార్తీకమాసం రెండవ ఆదివారం పేరుపాలెం బీచ్ సందర్శకులతో నిండిపోయింది. సముద్ర అలల మధ్య సేద తీరారు. బీచ్ వద్ద గుర్రాలపై స్వారీ చేశారు. పలు వినోద కార్యక్రమాల్లో ఉత్సాహంగా గడిపారు. తీరం వెంబడి గల ఆలయాలను దర్శించారు. సుమారు 15వేల మంది పర్యాటకులు బీచ్‌ను సందర్శించారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆర్డీవో దాసిరాజు పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- మొగల్తూరు



శ్రీనాథుడు రచించిన భీమేశ్వర పురాణంలో పంచారామాల వృత్తాంతం గురించి ఉన్నట్లు పండితులు చెపుతున్నారు. క్షీరసాగర మథన సమయంలో వెలువడిన అమృతాన్ని మహావిష్ణువు మోహిని రూపం ధరించి సురాసురులకు పంచుతుండగా తమకు అన్యాయం జరిగిందంటూ రాక్షసులు అసంతృప్తి చెందారు. వారు శివుడు కోసం తీవ్ర తపస్సు చేశారు. తారకాసురుడు అనే రాక్షసుడు మహా తపస్సు చేసి తనకు స్త్రీ గర్భము నుంచి పుట్టిన ఎవరి వల్లా మరణం రాకూడదని పరమశివుని వరం పొందుతాడు. శివుడు తన ఆత్మలింగాన్ని ప్రసాదించి వరం అనుగ్రహిస్తాడు. తారకాసురుడు ఆ వర గర్వంతో దేవతలను హింసించడంతో వారంతా మహాదేవుని వేడుకుంటారు. స్త్రీగర్భం నుంచి పుట్టనివారు ఎవరా ఆలోచింపగా కుమారస్వామిని గుర్తించి పరమశివుని ఆదేశానుసారం దేవతల సైన్యానికి అధిపతిగా నియమిస్తారు. కుమారస్వామి తారకాసురుడితో భీకర యుద్ధం చేసి తన పాశుపతంతో వధిస్తాడు. తారకాసురుని మెడలో ఆత్మలింగం ఐదు ఖండాలుగా అవుతుంది. ఈ ఐదు ఖండములు ఐదు క్షేత్రాలలో ప్రతిష్ఠించబడ్డాయి. అందులో ఒకటి అమరావతిలో ఇంద్రుడు ప్రతిష్ఠించగా, రెండో శకలం చంద్రునితో భీమవరం గునుపూడిలో, మూడో శకలం శ్రీరామచంద్రునిచే పాలకొల్లులో, నాల్గవ శకలం కుమారస్వామిచే సామర్లకోటలో ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఐదవ శకలం ద్రాక్షారామంలో ప్రతిష్ఠించేందుకు సప్త మహారుషులు సంకల్పించగా అనుకున్న మూహూర్తానికి కాలయాపన జరగడంతో భీమేశ్వరుడు స్వయంభువుగా వెలసినట్లు తెలుస్తున్నది. అవే పంచారామ క్షేత్రాలుగా విలసిల్లుతున్నాయి.

- భీమవరం టౌన్



# ఓం నమో.. శివ రుద్రాయ..

## ముక్తిదాయకం.. పంచారామ క్షేత్ర దర్శనం

### వర్ణాలు మారే గునుపూడి సోమేశ్వరుడు

చరిత్ర ప్రసిద్ధికెక్కిన అతి ప్రాచీన దేవాలయాలలో గునుపూడి శ్రీసోమేశ్వర జనార్థనస్వామి ఆలయం ఒకటి. తూర్పుచాళుక్య రాజులలో ప్రసిద్ధుడైన చాళుక్యభీముడు ఈ దేవాలయాన్ని మూడో శతాబ్దంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. స్థలం పురాణంలో ఈ క్షేత్రాన్ని పరమ పవిత్రక్షేత్రంగా వర్ణించారు. ఈ దేవాలయం గురించి భీమ ఖండం, బ్రహ్మాండ పురాణంలోను పేర్కొన్నారు. చంద్రుడే స్వయంగా ప్రతిష్ఠంచడం వల్ల ఇక్కడి శివలింగం అమావాస్య రోజున గోధుమవర్ణంలోను, పౌర్ణమినాడు శ్వేతవర్ణంలో కనిపిస్తుంది. శివలింగ పైభాగమున అన్నపూర్ణ అమ్మవారి విగ్రహం ఉండటం మరో ప్రత్యేకత. ఈశ్వరుడు గంగను శిరస్సుపై ధరించడానికి ప్రతీకగా ఈ విధంగా నిర్మితమైనదని ప్రజల నమ్మకం. ఈ దేవాలయానికి జనార్ధనస్వామి క్షేత్రపాలకుడు అవడంతో ఇక్కడ వివాహం చేసుకుంటే వైవాహిక జీవితం ఎంతో శుభమయంగా సాగుతుందని నమ్మకం.



### యోగ లింగం.. కుమారరామం



సామర్లకోటలోని కుమారరామ భీమేశ్వరాలయం రాష్ట్రంలో ఏకైక యోగలింగంగా, జప, తప, యోగ సాధన చేసే వారికి ప్రశాంతమైన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. చాణక్య వంశానికి చెందిన భీమమహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.సామర్లకోట కుమారరామ భీమేశ్వర స్వామి, ద్రాక్షరామ భీమేశ్వరాలయం ఈ రెండు ప్రాకారాలు వాస్తురీత్యా ఒకే ఆకారం కలిగి ఉంటాయి. నాలుగు దిక్కులలో నాలుగు గోపుర ద్వారాలు, లోపలి ప్రాకారం సమతలంగాను రెండు భాగములు చేయబడినవి. గుడి చుట్టూ రెండంతస్తులు మండపం ఉంది. ఈ మండపం ఎక్కేందుకు తూర్పుభాగాన మెట్లు, లోపలి మండపం నుంచి కిందికి దిగేందుకు దక్షిణం వైపున విఘ్నేశ్వరుని ఆలయం, సూర్యుని గుడి, తూర్పు వైపున గిరిజా సుందరి ఆలయం ఉన్నవి. లోపలి ప్రాకారం మధ్యలో ఉన్న భీమేశ్వరుని ఆలయం చతురస్రాకారంగా ఉండి రెండు అంతస్తులు కలిగి ఉన్నది. కింది అంతస్తులో ప్రతిష్ఠించిన లింగం పైఅంతస్తు కప్పుగుండాపోయి రెండో అంతస్తులోకి ప్రవేశించి రుద్రభాగం పూజింపబడుతున్నది.





### ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం.. ద్రాక్షారామం..



పంచారామాలలో ప్రసిద్ధి గాంచిన ఆరామంగా, త్రిలింగ క్షేత్రాలలో ఒకటిగా, ద్వాదశ జ్యోతిర్లాంగాలలో ప్రముఖ క్షేత్రంగా విరాజిల్లుతున్న ప్రాచీన శైవక్షేత్రం ద్రాక్షారామం. ఈ క్షేత్రంలో స్వయంభువుడుగా భీమేశ్వర స్వామి, అష్టాదశ శక్తిపీఠాలలో ద్వాదశ శక్తిపీఠంగా మాణిక్యాంబ అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. ద్రాక్షారామ క్షేత్ర మహత్యం గురించి వ్యాసుడు తన భీమఖండంలో దక్షారామత్సరం నభూతో నభవిష్యతిగా స్తుతించాడు. కవి సార్వభౌముడు శ్రీనాధుడు ద్రాక్షారామ వంటి క్షేత్రం, భీమేశ్వరుని వంటి దైవం, సప్తగోదావరి వంటి తీర్థరాజం ఇలలోలేదని పేర్కొన్నాడు. భీమేశ్వరుని ఆలయం క్రీశ 892-922 కాలంలో నిర్మాణం ప్రారంభించినట్లు ఆలయంలో ఉన్న శిలాశాసనాల ద్వారా తెలుస్తున్నది. చాళుక్యరాజు మొదటి భీమునికాలంలో నిర్మాణం జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి. కార్తీకమాసంలో సప్తగోదావరిలో పుణ్యాస్నానమాచరించి భీమేశ్వరుని దర్శిస్తే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. భీమేశ్వరునికి సూర్యభగవానుడు తొలి అర్చన చేసినట్లు చెబుతారు.

### దేవేంద్రుడు ప్రతిష్ఠించిన అమరేశ్వరస్వామి



అమరావతిలో శివలింగాన్ని దేవతల రాజైన ఇంద్రుడు ప్రతిష్ఠించాడని స్థలపురాణం. తారకాసురుని మెడలోని కుమారస్వామి ఛేదించిన ఆత్మలింగం ఐదు ముక్కలుగా పగిలి ఐదు క్షేత్రాలలో పడింది. అందులో అమరావతిలో పడిన భాగాన్ని దేవతలకు అధిపతి ఆయిన దేవేంద్రుడు ప్రతిష్ఠించినట్టు స్థల పురాణంలో ఉంది. ఇక్కడ శివలింగం అత్యంత ఎత్తుగా ఉండటంతో అర్చకులు పీఠం ఎక్కి అభిషేకాలు చేస్తూంటారు. ఎత్తు పెరగకుండా ఉండేందు బృహస్పతి ఆదేశాల మేరకు మేకు కొట్టడంతో శివలింగం పైభాగంటో రక్తం మరక ఏర్పడినట్టుగా చెబుతారు ఇప్పటికీ ఆ మరక కనిపిస్తుంది. ఈ శివలింగాన్ని శ్రీరామచంద్రుడు చేత పూజించబడిందని చెబుతారు. అమరుల నివాసంగా మారిన ప్రాంతంగా అమరావతి అనే పేరు వచ్చిందని పురణాకధనం.. బాలచాముండికా సమేతుడైన అమరేశ్వరస్వామి భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. పంచారామాలను కార్తీకమాసంలో ఒకేరోజు దర్శించిన భక్తులకు కోరికలు తీరడంతో పాటు మోక్షం కలుగుతుంది.



### ఒకే రోజు ఐదు క్షేత్రాల దర్శనం

#### ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలన్నిటినీ ఒకేరోజు దర్శించుకునే విధంగా ఆర్టీసీ అధికారులు పంచారామ దర్శిని పేరిట బస్సులు నడుపుతున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సంబంధిత దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో మాట్లాడి పంచారామ భక్తులకు త్వరిత గతిని దర్శనం చేయించే విధంగా ప్రతీ దేవాలయం వద్ద ఆర్టీసీ ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ విధానం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. సంబంధిత డిపో మేనేజర్లను సంప్రదిస్తే వివరాలు తెలుస్తాయి టికెట్ ధర ఇలా ఉంది. పల్లెవెలుగుకు 720, ఎక్స్‌ప్రెస్ రూ.900, అల్ట్రా డీలక్స్‌కు రూ 1100. సూపర్ లగ్జరీకి రూ.1200 నిర్ణయించారు. సోమవారం భక్తులకు దర్శనాలు కల్పించేందుకు 17 బస్సులను నడుపుతోంది. భీమవరం డిపో నుంచి 6, నరసాపురం నుంచి 3, తణుకు నుంచి 4, తాడేపల్లిగూడెం నుంచి 4 బస్సులను నడుపుతున్నారు. ఆదివారం రాత్రి 9-30 నిమిషాలకు భక్తులను ఎక్కించుకుని బయలుదేరాయి. తిరిగి సోమవారం రాత్రికి ఆయా డిపోలకు చేరుకుంటాయి.


**వివిధ డిపో మేనేజర్ల ఫోన్ నంబర్లు ఇవీ..**

| | |
|---|---|
| ఏలూరు డిపో మేనేజర్ | 99592 25487 |
| భీమవరం డిపో మేనేజర్ | 99592 25485 |
| నర్సాపురం డిపో మేనేజర్ | 99592 25486 |
| తణుకు డిపో మేనేజర్ | 99592 25484 |
| జంగారెడ్డిగూడెం | 99592 25489 |
| తాడేపల్లిగూడెం | 99592 25488 |
| కొవ్వూరు డిపో | 91009 54631 |
| నిడదవోలు డిపో మేనేజర్ | 94911 88236 |

### విష్ణుమూర్తి ప్రతిష్ఠించిన క్షీరారాముడు..



క్షీరపురి (పాలకొల్లు)లో పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామి కొలువుతీరి ఉన్నారు. స్కాంధపురాణ ఆధారంగా ఆలయ చరిత్ర గురించి తెలుస్తున్నది.తారకాసురుడిని వధించడానికి శివుని కుమారుడు కుమారస్వామి భీకర యుద్ధం చేసి తారాకాసురుడి దేహంలో ఉన్న అమృతలింగం ఖండించాడు. అందులో శిరోభాగం క్షీరపురి క్షేత్రంలో పడటంతో శ్రీమహావిష్ణువు ఆ ఖండభాగాన్ని ప్రతిష్ఠించినట్టు తెలుస్తున్నది. 918 ప్రాంతంలో మొదటి చాణిక్య భీముడు ఇక్కడ ఆలయ నిర్మాణం చేపట్టినట్టు చరిత్ర ఆధారంగా తెలుస్తున్నది. అనంతరం శాతవాహనులు, ఇక్ష్వాకులు, తూర్పు చాణుక్యుల పాలనలో ఆలయం అభివృద్ధి చెందింది. దీంతో పాటు 120 అడుగుల ఎత్తున తొమ్మిది అంతస్తులలో గాలిగోపురం నిర్మించి పైభాగంలో శిఖరాలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో పంచగణపతులు, శివ పంచాయతన దేవాలయం, పంచ లింగాలు, పంచ దేవేర్లు, పంచ మండపాలు, పంచ ద్వారాలు, పంచ నందులు, పంచ శిఖరాలు ఉండటం విశేషం. ఇక్కడి శివలింగం తెల్లని పాలరంగులో ఉంటుంది.. క్షీరారామంలో ఒక రోజు బస చేస్తే ఒక ఏడాది ఉన్నట్లేనని నమ్మకం..







పంచ శివాలయాల బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

## బైక్ ర్యాలీగా పంచ శివాలయాల దర్శనం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్షీరారామలింగేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పంచ (5) శివాలయాల దర్శనం పేరుతో చేపట్టిన బైక్ ర్యాలీని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు జెండా ఊపి ప్రారంభించారు.నిమ్మల మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి దర్శనం అనంతరం పూలపల్లిలోని మరకత లింగం ఆలయంలో స్వామిని దర్శించుకుంటారు. వీరవాసరంలోని వీరేశ్వర విశ్వేశ్వరస్వామి దర్శనం అనంతరం భీమవరంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి గునుపూడి సోమేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం యన మదుర్రు శక్తీశ్వరస్వామి దర్శనం అనంతరం అక్కడే ప్రసాదం తీసుకుని ర్యాలీ ముగిస్తారు. సేవా సమితి అధ్యక్షుడు శీరం ఆనంద కృష్ణ, సభ్యులు జక్కంపూడి కుమార్, ధనాని ప్రకాశ్, కొప్పుల శ్రీను, సీహెచ్ శ్రీనివాస్, మహిళలు, అయ్యప్ప శివమాల ధారులు పాల్గొన్నారు.





రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన విశాఖపట్నం బాలికల.. బాలుర జట్లు

## స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ విజేత విశాఖ

పెదవేగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో పెదవేగిలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో రెండురోజుల పాటు జరిగిన 19 ఏళ్ళ విభాగం రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జట్లు ప్రతిభతో ప్రథమస్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో విశాఖజట్టు ప్రథమస్థానం సాధించగా, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లా జట్లు ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో విశాఖజట్టు ప్రథమ స్థానంలో నిలవగా అనంతపురం, ప్రకాశం జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు పీడీలు సుబ్బారావు, ధనలక్ష్మి, గురుమూర్తి,13 జిల్లాలకు చెందిన పీడీలు పాల్గొన్నారు.

## క్రీడాకారిణికి రాయల్ క్లబ్ ఆర్థిక సాయం

చింతలపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడికి చెందిన క్రీడాకారిణి వి.భార్గవికి రాయల్ క్లబ్ సభ్యులు రూ.13,500 ఆర్థిక సాయం అందించారు. భార్గవి జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయ అథ్లెటిక్స్ పోటీలలో జావలెన్ త్రోలో పాల్గొనడానికి ఎంపికైంది. ఈమె గతంలో జావలెన్‌త్రో, షాట్‌పుట్ రెండింటిలోను బంగారు పతకాలు, అంతర్ జిల్లాల పోటీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. జాతీయ పోటీలకు ఎంపికవడంతో రాంచీ వెళ్ళడానికి ఖర్చుల కోసం రాయల్ క్లబ్ ఆమెకు ఈ సహాయం అందజేసింది. సభ్యులు చిక్కాల నాగేశ్వరరావు, కొండపల్లి శేషగిరిరావు, గంధం రామ్మోహన్‌రావు, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

## కొల్లేరుకు విదేశీ చుట్టాలు



కైకలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొల్లేరు సరస్సుకు విదేశీపక్షులు రాక మొదలైంది. మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరుకు ప్రతి సంవత్సరం వివిధ జాతులకు చెందిన పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణించి చేరుతుంటాయి. కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీరప్రాంతాల నుంచి శీతాకాలపు అతిధులుగా వచ్చి పర్యాటకులను ఆకర్షిస్తాయి. కొల్లేరు సరస్సులో చేపలను వేటాడి ఆహారాన్ని తీసుకుంటాయి. సమీప ప్రాంతాల నుంచి పుల్లలు తెచ్చుకుని గూళ్లు కట్టుకుంటాయి. పెయింటెడ్ స్టాక్, పెలికాన్‌తో పాటు ఎర్రకాళ్ళ ఉలసలు, తెల్ల, నల్ల కంకణాల పిట్టలు, జనకబాతులు, నీటికోళ్ళు, ఊది చెంచుకోడి, పెద్ద ఉల్లంకి పక్షులు సంతానోత్పత్తి కోసం కొల్లేరుకు వస్తుంటాయి.

### పెయింటెడ్ స్టాక్ (ఎర్రకాళ్ళ కొంగ)

పెయింటెడ్ స్టాక్ పక్షి ఒంటిపై ముద్దులొలికే రంగులు ఉంటాయి. గులాబీ, నలుపు రంగులు పెయింటింగ్ వేసినట్లు కనిపిస్తాయి. కాళ్లు, ముక్కు ఎర్రగా ఉంటాయి. ఈపక్షి పిల్ల దశలో పూర్తిగా నలుపు రంగులో కనిపిస్తుంది. వయసు పెరిగే కొద్దీ రంగులద్దుకుంటుంది. ముళ్ళు ఉన్న చెట్లపై ఎక్కువగా గూడు ఏర్పాటు చేసుకుంటాయి. ఉత్తరభారతదేశం నుంచి శీతాకాలం ప్రారంభమైన తరువాతనే దక్షిణాది ప్రాంతాలకు వలసలు వస్తాయి. వీటి రంగులు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.



ఐరన్ స్టాండ్‌లపై నివాసం



### పెలికాన్ (గూడబాతు)



పెలికాన్ పక్షి కొల్లేరు సరస్సులో రారాజులా కనిపిస్తూంటాయి. అక్టోబర్ నుంచి మార్చినెలల మధ్యకాలంలో ఈ జాతిపక్షులు కొల్లేరుకువచ్చి గుడ్లుపెట్టి పొదుగుతుంటాయి. ఆడపక్షి గుబురుగా ఉండే చెట్ల పొదల్లో, అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన కృత్రిమ ఇనుపస్టాండ్లపై గుడ్లు పెట్టి పొదుగుతుండగా మగపక్షి సరస్సులో సంచరించి ఆహారాన్ని తీసుకువస్తూ ఉంటుంది. సుమారు 2 నుంచి 6 కేజీల బరువు ఉండే ఈ పక్షి గోధుమ వర్ణంలో ఉండి పొడవైన ముక్కు, దానికింద సంచి వంటి భాగం ఉండి అరకిలో నుండి కేజీ బరువు గల చేపను గుటుక్కున మింగేస్తుంది. ప్రతి సంవత్సరం వేలాది పెలికాన్స్ తరలిరావడంతో అధికారులు ఆటపాక పక్షుల కేంద్రానికి పెలికాన్ ఫ్యారడైజ్‌గా పేరు పెట్టారు.

## ద్వారకా తిరుమల కొండపై ట్రాఫిక్ సమస్య

### వేరే రోడ్డుకు మళ్లించడంతో భక్తులకు ఇబ్బందులు

ద్వారకాతిరుమల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయానికి వాహనాలపై వచ్చిన భక్తులు దేవాలయ అధికారుల అనాలోచిత నిర్ణయానికి ఆదివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయానికి ప్రతీ శని, ఆదివారాల్లో వేలాది సంఖ్యలో యాత్రికులు, వందల సంఖ్యలో కార్లు వస్తుంటాయి. అయితే ఆదివారం శ్రీవారి ఘాట్ రోడ్డు నుంచి ఆలయానికి పైకి వెళ్లిన వాహనాలను సెంట్రల్ పార్కిగ్‌లో ఉంచి దర్శనానంతరం శివాలయ వద్దనున్న దిగువ రోడ్డు మీదుగా కిందకు దిగాలని అధికారులు నిర్ణయించారు. ఈ విధంగా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. దీంతో వాహనంలో వచ్చి మొక్కు బడులు తీర్చుకోవాలనుకున్న వృద్ధులు, మహిళలు రోడ్డుకు అటువైపు ఉన్న కేశఖండన శాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.వారు చుట్టు తిరిగి రావాల్సి వచ్చింది. ఇప్పటివరకూ దర్శనానికి కార్లలో వచ్చేవారు ఘాట్ రోడ్డు గుండా టోల్‌గేట్ మీదుగా పైకి వచ్చి సెంట్రల్ పార్కింగ్‌లో వాహనాలను ఉంచేవారు. తర్వాత పక్క రోడ్డు గుండా కిందకు వెళ్లేవారు. అదే మొక్కులు తీర్చుకునే పెద్దవారయితే సెంట్రల్ పార్కింగ్ టర్నింగ్ తీసుకుని కేశఖండనశాల వద్ద దిగేవారు. ఇది వారికి కాస్త సులువుగా ఉండేది. కానీ ఇప్పుడు రూటు మార్చడంతో యాత్రికులు ఇబ్బందులు పడ్డారు. దీంతో భక్తులు గొడవ చేయడంతో సాయంత్రానికి అధికారులు యథావిధిగా మార్పు చేశారు. గతంలో ఆశ్రం వద్ద నున్న గేటు నుంచి వాహనాలు రాకపోకలు సాగించేవి. ఘాట్ రోడ్డు నిర్మించిన వాడుకలోకి వచ్చిన కారణంతో ఆ గేటును కొన్నాళ్లుగా మూసి వేశారు. ప్రస్తుతం ఆగేటు నుంచి పాదచారులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నారు. ఆ గేటు కూడా తెరిస్తే బావుంటుందని స్థానికులు అంటున్నారు.



ఘాట్‌రోడ్డు మీదుగా సెంట్రల్ పార్కింగ్‌కు వెళ్తున్న భక్తుల వాహనాలు



మూసి వేసిన పాత గేటు



సెంట్రల్ పార్కింగ్ ముందు అడ్డదిడ్డంగా వాహనాలు



శివాలయం వద్ద ట్రాఫిక్ మళ్లించిన రోడ్డు ఇదే..

గురుర్బ్రహ్మా, గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వరః :
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా, తస్మైశ్రీ గురవే నమః



# మారుతున్న గురుస్థానం

## నేటి విద్యావ్యవస్థలో పెనుమార్పులు

- కొన్ని విధానాలతో విద్యావ్యవస్థ బలోపేతం.. మరికొన్నింటితో విద్యార్థులు పక్కదోవ

నేడు జాతీయ విద్యా దినోత్సవం

**గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పోలుస్తూ గురువుకు అత్యున్నత స్థానం ఇచ్చేవారు. తల్లి, తండ్రి తర్వాత గురువుకే ప్రాధాన్యత ఇచ్చేవారు. ఒకప్పుడు రాకుమారుడైనా విద్య నేర్చుకోవడానికి గురువు ఆశ్రంలో గురువుకు సర్వ సపర్యలు చేస్తూ విద్యను అభ్యసించేవారు. నేడు మారుతున్న కాలంలో గురుస్థానం కూడా మారుతోంది. ఆశ్రమాల స్థానంలో ఏర్పడిన విద్యాపీఠాలు, తర్వాత పాఠశాలలు, కళాశాలలు, అకాడమీలు రూపాంతరం చెంది నేటి విద్యావవస్థలో పెనుమార్పులు సంభవించాయి. ఆధునిక టెక్నాలజీ వల్ల విద్యాబోధనలో ఎన్నో మార్పులు చోటుచేసు కుంటున్నాయి. కొన్ని మార్పులు విద్యావ్యవస్థను బలోపేతం చేస్తుండగా.. మరికొన్ని విద్యార్థులను పక్కదోవ పట్టిస్తున్నాయి. మన దేశ తొలి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని నవంబరు 11వ తేదీన జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.**

నిడమర్రు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :

### గురు ఆశ్రమాల నాటి విద్యావ్యవస్థ..

గురుఆశ్రమాలలో విద్యార్థులందరూ అడవులలో వనవాసంగా ఉంటూ విద్య నేర్చుకునేవారు. గురువులు వారికి విద్యాబోధన చేస్తూ నైతికవిలువలు బోధించేవారు. వేద విద్య, వేద గణితం, శాస్త్రీయ దృక్పథంతో కూడిన విద్య, యుద్ధవిద్యను బోధించేవారు.

### బ్రిటీష్ విద్యావిధానంతో మార్పులు..

1835లో బ్రిటీష్ గవర్నర్ జనరల్ విలియం బెంటిక్ ఉన్న కాలంలో లార్డ్ మెకాలే భారతదేశంలో ఆంగ్ల విద్యకు పునాది వేశాడు. భారతీయ విద్యాబోధనలో ఆంగ్లాన్ని ప్రవేశపెట్టి భారతీయ విద్యార్థులకు ఆంగ్ల భాషను నేర్పించడం మొదలుపెట్టారు. తద్వారా భారతీయ విద్యార్థులు ఆంగ్ల భాషపై మంచి పట్టుసాధించి విదేశీ విద్యను అభ్యసించి ప్రపంచ పరిజ్ఞానం పెంచుకుని మేధావులుగా తీర్చిదిద్దబడి దేశానికి, ప్రపంచానికి అత్యున్నత సేవలు అందించారు.

### స్వతంత్ర భారతంలో విద్యావ్యవస్థ..

భారతదేశం 1947లో స్వాతంత్ర్యం అనంతరం తొలి విద్యాశాఖ మంత్రి మలౌనా అబుల్ కలాం ఆజాద్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. విద్యావిధానం అభివృద్ధికి కృషి చేశారు. 1967లో కొఠారి కమిషన్ ద్వారా దేశంలో తొలిసారి 10+2+3 విద్యావిధానం ప్రవేశ పెట్టారు. 2000లో జాతీయ విద్యావిధానంలో సమగ్రశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలలకు కావల్సిన వసతులు కల్పనతో పాటు సీసీఈ విధానంలో అంటే నిరంతర సమగ్ర మూల్యాంకనం జరుగుతుంది.

### ఎటువంటి విద్య కావాలంటే..

నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే ప్రకారం మన రాష్ట్రంలో పదో తరగతి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు 80శాతం అయినప్పటికీ, వారికి సామర్థ్యం 20శాతం కూడా ఉండడం లేదు. మన రాష్ట్రం లోనే కాదు దేశంలో ప్రతి ఏడాది 15 లక్షల మంది ఇంజనీర్లు విద్యాసంస్థల నుంచి పట్టభద్రులై వస్తున్నారు. వారిలో 15శాతం మాత్రమే ప్రస్తుత ప్రపంచానికి తగిన నైపుణ్యాలను కలిగి ఉండడం దురదృష్టకరం. మారుతున్న సమాజానికి పనికొచ్చే అసలు సిసలైన విద్య మన విద్యార్థులకు కావాలి.

### ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యా సమాచారం

**ఏలూరు జిల్లాలో (ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలలు)**

మండలాలు సంఖ్య 27.
పాఠశాల సంఖ్య : 2,364
ఉపాధ్యాయుల సంఖ్య : 11,450
విద్యార్థుల సంఖ్య : ప్రాథమిక : 1,21,540, ప్రాథమికోన్నత 84,190, ఉన్నత పాఠశాలల్లో : 52,239 మొత్తం : 2,57,969.

**పశ్చిమ గోదావరి జిల్లాలో (ప్రభుత్వ/ప్రైవేట్ స్కూల్స్)**

మండలాల సంఖ్య : 20
పాఠశాలలసంఖ్య : 1,942
ఉపాధ్యాయుల సంఖ్య : 9,400
విద్యార్థుల సంఖ్య : ప్రాథమిక 1,11,798, ప్రాథమికోన్నత 78,984, ఉన్నత పాఠశాలల్లో 49,259 మొత్తం : 2,40,041

### ఉపాధి, నైపుణ్యాలను పెంచని చదువు..

నైపుణ్యాలను పెంచని చదువు... ఉత్పాదకతను ఇవ్వని చదువు వల్ల ప్రయోజనం ఏమిటి ?

ప్రస్తుత విద్యా విధానం ఎలా ఉందంటే ఎడ్యుకేషన్ సిస్టం అంటే ఎగ్జామినేషన్ సిస్టమ్‌గా ఉంది. నేటి కార్పొరేట్ విద్యాసంస్థల మాయాజాలంలో తల్లిదండ్రులు కూడా పడి తమ పిల్లలను బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. విద్యాలయాలు అంటే విద్యకు మాత్రమే నిలయాలు కాదు. విద్యాలయాలు ఆనందాల నిలయాలు. ప్రతి విద్యార్థిని సమర్థుడిగా తీర్చిదిద్దేట్లు మన విద్యావ్యవస్థ ఉండాలి.

### విద్యావ్యవస్థలో సంస్కరణలు ఇలా..

- విద్యార్థుల వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఉండాలి.
- మానసిక, శారీరక ఆరోగ్యం పట్ల అవగాహన. ప్రతి రోజూ వ్యాయామం పాఠశాల విద్యలో ఉండి అమలు జరగాలి.
- సామాజిక బాధ్యతను తెలియజేస్తూ, సార్వత్రిక అవగాహన కల్పిస్తూ, ఆధునిక టెక్నాలజీ పట్ల అవగాహనతో కూడిన విద్యను అందివ్వాలి.
- సమగ్ర శిక్షణకు వేదికగా, నైపుణ్య ఆధారిత విద్యకు మూలంగా, పరిశోధనకు కేంద్రంగా విద్యావిధానం ఉండాలని విద్యావేత్తలు కోరుతున్నారు.
- ప్రతి విద్యార్థి అమూల్యమనే అనే భావనతో విద్యాబోధన జరిగినప్పుడే సంపూర్ణ విద్య భావన విజయవంతమవుతుంది.

### చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ వహించాలి



మాది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. మా కష్టార్జితం అంతా పిల్లల భవిష్యత్తు కోసం వెచ్చిస్తున్నాం. నేటి ఆధునిక కాలంలో నైపుణ్యం పెంపుపై గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణ విద్యార్థులతో పోటీ పడలేకపోతున్నారు. స్కూల్స్‌లో పూర్తిస్థాయిలో టీచర్లను నియమించినపుడే చక్కటి విద్య అందించబడుతుంది. పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత తగ్గుతోంది. దీని కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నడింపల్లి దేవి, విద్యాకమిటీ చైర్మన్, ఉన్నత పాఠశాల, ఫత్తేపురం

### యాప్‌ల భారం తగ్గించాలి



ఉపాధ్యాయులకు విద్యాబోధన సమయం పూర్తిగా సన్నగిల్లుతోంది. పాఠశాల విద్య ప్రవేశపెట్టే నూతన విద్యాప్రయోగాలు వల్ల ఉపాధ్యాయుడి విలువైన విద్యాబోధనా సమయం పూర్తిగా హరిస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న యాప్‌ల వల్ల 40కు పైగా అంశాలులో ఉపాధ్యాయుడు సమాచారం ఆన్‌లైన్‌లో పూరించాలి. ఉపాధ్యాయుడికి విద్యాబోధన సమయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయి.

– డి. జోగినాయుడు
టీచర్, ఉంగుటూరు మండలం

### గురుస్థానానికి ప్రత్యామ్నాయం.. టెక్నాలజీ కాదు.



నేటి విద్యావిధానంలో అనూహ్య మార్పులు చోటుచేసుకొంటున్నాయి. ఉపాధ్యాయుడు స్థానంలో వర్చువల్ బోధన, ఆన్‌లైన్ బోధనకు ప్రాధాన్యం ఉంటోంది. టెక్నాలజీ పేరుతో ఉపాధ్యాయుడుకి ప్రత్యామ్నాయం చూపుతూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ సహకారంతో టీచర్లను ప్రవేశపెట్టడానికి కొన్ని ఉన్నత విద్యాసంస్థలు ప్రయత్నిస్తున్నాయి. దీనివల్ల విజ్ఞానం, నైపుణ్యం వస్తుందేమో కానీ మానవతా విలువలు, దేశభక్తి, నైతిక విలువలు కోల్పోవలసి వస్తుంది.

– ముత్యాల కళ్యాణ్
ప్రిన్స్‌పాల్
వైఎస్. ఉపాధ్యా య శిక్షణ కళాశాల, నరసాపురం

# కొత్తగా మరికొందరికి ఉత్తమ పురస్కారాలు

ఏలూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ఇప్పటికే కొంతమంది ఎంపిక కాగా తాజాగా ఇంటర్, సాంకేతిక, ఉన్నత విద్య శాఖల నుంచి ఉత్తమ అధ్యాపక పురస్కారాలకు ఎంపికైనవారి జాబితాలను తాజాగా విడుదల చేశారు. ఆ ప్రకారం ఇంటర్ విద్యలో నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ జూనియర్ లెక్చరర్ సీహెచ్.వి.వి.రామచంద్రరావు, తాడేపల్లి గూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ పి.వి.నాగార్జున ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. సాంకేతిక విద్యలో తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ సివిల్ ఇంజనీరింగ్ లెక్చరర్ డి.శ్రీకాంత్, ఉన్నత విద్యలో యూనివర్సిటీ లెక్చరర్స్ విభాగం నుంచి వెంకటరామన్న గూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ వెజిటబుల్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ సయ్యద్ సదరున్నీసా ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు.

**ఉభయ గోదావరి జిల్లాల 'ఉత్తములకు' పురస్కారాల అందజేత వాయిదా**

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు సోమవారం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా విజయవాడలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించే జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి పురస్కారాలను అందించాల్సి ఉంది. అయితే ఉభయ గోదావరి జిల్లాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎంపికైన 27 మందికి (పాఠశాల విద్య నుంచి 14 మంది, ఇంటర్, సాంకేతిక, ఉన్నత విద్యాశాఖల నుంచి 13 మంది) సోమవారం అవార్డులివ్వడం లేదని, తిరిగి ఈ పురస్కారాలను ఎప్పుడు ఇచ్చేదీ అధికారికంగా ఇంకా ప్రకటించాల్సి ఉందని ఏలూరు జిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదివారం ధ్రువీకరించారు. కాగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోవడం తమ జీవితంలో మరుపురాని క్షణమని, ఈ ఏడాది ఈ గౌరవం దక్కే అవకాశం లేకపోవడం ఆవేదన కలిగిస్తోందని అవార్డులకు ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు వ్యాఖ్యానించారు. సీఎం, విద్యాశాఖ మంత్రితోనే మరోరోజు కార్యక్రమాన్ని నిర్వహించాలని వారు అభ్యర్థిస్తున్నారు.

# జేఎన్వీలో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

పెదవేగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 9,11వ తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జేఎన్వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి నవోదయ విద్యాలయ సమితి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని చెప్పారు. పరీక్షకు దరఖాస్తు చేయడానికి ఈనెల 19వ తేదీ వరకు గడువును పొడిగించిందన్నారు. దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకోవడానికి ఈనెల 20,21 తేదీల వరకు అవకాశం కల్పించారన్నారు. అభ్యర్థులు 9వ తరగతిలో ప్రవేశానికి https:// cbseitms. nic.in/ 2024/nvsix/, 11వ తరగతిలో ప్రవేశానికి https://cbseitms. nic.in/ 2024/nvsxi/ వెబ్‌సైట్‌ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.



అండర్-19 బాలుర విభాగంలో ప్రథమ స్థానం పొందిన పశ్చిమ జిల్లా జట్టు

# అండర్-19 టెన్నికాయిట్ బాలుర విజేత 'పశ్చిమ'

## ముగిసిన 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ పోటీలు

చింతలపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడిలో ఈనెల 9, 10 తేదీల్లో ప్రభుత్వ హైస్కూలులో జరిగిన రాష్ట్ర 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. 13 జిల్లాల నుంచి బాలురు, బాలికలు 390 మంది పాల్గొన్నారు. 78 జట్లు లీగ్ నాకౌట్ పద్ధతిలో పోటీ పడ్డాయి. దీనిలో అండర్-19 బాలికల విభాగంలో అనంతపురం ప్రథమ, తూర్పు గోదావరి ద్వితీయ, చిత్తూరు తృతీయ స్థానాలు పొందాయి. అండర్-17 బాలికల విభాగంలో అనంతపురం ప్రథమ, తూర్పుగోదావరి ద్వితీయ, పశ్చిమ తృతీయ స్థానాలు పొందాయి. అండర్-14 బాలికల విభాగంలో పశ్చిమ ప్రథమం, విజయనగరం ద్వితీయ, అనంతపురం తృతీయ స్థానాలు పొందాయి.

**బాలుర విభాగంలో..** అండర్-19లో పశ్చిమ జిల్లా జట్టు ప్రథమ, విజయనగరం ద్వితీయ, శ్రీకాకుళం తృతీయ, అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ తూర్పుగోదావరి, ద్వితీయ విశాఖ పట్టణం, తృతీయ అనంతపురం సాధించాయి. అండర్-14 బాలుర విభాగంలో అనంతపురం ప్రథమ, పశ్చిమ ద్వితీయ, తూర్పుగోదావరి తృతీయ స్థానాలు సాధించాయి. ముగింపు సభలో పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే క్రీడాకారులు మరింత స్థాయికి ఎదుగుతారని, క్రీడారంగం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విజేతలకు మాజీ స్పోర్ట్స్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పేరం రవీంద్రనాథ్, పోటీల పరిశీలకులు ఎన్.టి. ప్రసాద్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ, కె.రమేష్, కె.సురేష్‌కు మార్, హెచ్‌ఎం పి.సుధాక రరావు, పిట్టా వేణు, మాటూరి చక్రధరరావు, అల్లూరి గిరిరాజు తదితరుల చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులు అందజేశారు. మండలంలోని పీడీలు, పీటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు..

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..
- కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాలులో సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్
- అభ్యర్థితోపాటు ఐదుగురికే అనుమతి
- నేడు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్న కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం అవుతుంది. కాకినాడ కలెక్టరేట్ కోర్టుహాలులో ఈ మేరకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. కలెక్టరేట్ ప్రాంగణంలోకి మూడు కార్లకు అనుమతి ఇస్తారు. కోర్టుహాలులో నామినేషన్ సమర్పించేందుకు అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఇస్తారు. అభ్యర్థులకు ఉండే సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశారు. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ విడుదల చేస్తారు. నామినేషన్ల పరిశీలనకు ప్రత్యేక అధికారుల బృందాన్ని నియమించారు. ఈనెల 18వతేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 19న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈనెల 21న నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుంది. డిసెంబరు 5న పోలింగ్, డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

### మొత్తం ఓటర్లు 16,316 మంది

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 16,316మంది ఉన్నారు. మొత్తంగా 116 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

### ఆరు జిల్లాల నుంచి కాకినాడకే కావాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆరు జిల్లాల నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు రావాలి. దీనిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి.

### ఎమ్మెల్సీ మృతి చెందడంతో ఉప ఎన్నిక

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికైన పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది డిసెంబరు 15న రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో ఈ ఉపఎన్నిక జరుగుతుంది. 2021లో జరిగిన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జీ ఎన్నికయ్యారు. వాస్తవానికి ఆయన పదవీకాలం 2027, మార్చి 29వతేదీ వరకు ఉంది. రోడ్డుప్రమాదంలో మృతిచెందడంవల్ల ఉపఎన్నిక అనివార్యమైంది.

## క్రైమ్ కార్నర్

### చికిత్స పొందుతూ ముఠామేస్త్రి మృతి

టి.నరసాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై కలుపుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టి.నరసాపురం మండలం వల్లంపట్ల గ్రామంలో జరిగింది. హెచ్‌సీ కె. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన చవల వెంకటదుర్గారావు(35) బస్ డిపోలో ముఠా మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అతడికి 15 ఏళ్ళ క్రితం కనకదుర్గతో వివాహమైంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అతడు ఇటీవల గ్రామంలో కౌలుకు తీసుకున్న జీడితోటకు కొట్టగా మిగిలిన కలుపుమందు పొలాల్లో కలుపుకుని ఈనెల ఒకటిన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని స్థానికంగా వైద్యం చేయించి ఆ తరువాత జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్లు మృతుడి భార్య కనకదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

### ఒంటరి జీవితంపై విరక్తితో..

**ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య**

పెదపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, భార్య చనిపోవడంతో ఒంటరిగా జీవనం సాగిస్తూ జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన పెదపాడు మండలం కొత్తూరులో ఆదివారం జరిగింది. పెదపాడు ఎస్‌ఐ కట్టా శారద సతీష్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన దంపనబోయిన శ్రీరంగం (40) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య 15 ఏళ్ల క్రితం మృతి చెందగా తండ్రి గతంలోనే చనిపోయాడు. తల్లి ఐదు నెలల క్రితం చనిపోయింది. ఈక్రమంలో శ్రీరంగం మూలలంకలో ఉంటున్న చెల్లెలు కృష్ణకుమారి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈనెల పెన్షన్ తీసుకునేందుకు గ్రామానికి వచ్చి పెన్షన్ తీసుకున్న అనంతరం ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఆదివారం ఉదయం ఉరి వేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

### పిచ్చికుక్క స్వైర విహారం.. ఇద్దరికి గాయాలు

ద్వారకాతిరుమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల లోని తూర్పు వీధిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన ఉప్పల కిషోర్, జస్వంత్ అనే ఆరేళ్ల బాలుడిపై దాడి చేసి గాయపరిచింది. స్థానికులు దానిని వెంబడించేసరికి అది పారిపోయింది. బాధితులను స్థానిక పీహెచ్‌సికి తరలించి చికిత్స చేయించారు. గ్రామంలో ఇటీవల కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.



జస్వంత్ కాలుపై కుక్క కరిచిన దృశ్యం

### మహిళపై దౌర్జన్యం.. ఇద్దరిపై కేసు

ఉండి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివాహిత మహిళపై దౌర్జన్యం చేసిన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశామని ఉండి పోలీసులు ఆదివారం తెలిపారు. ఉండి ఎస్‌ఐ నజీరుల్లా తెలిపిన వివరాలివి.. ఉండి గ్రామం రామాపురానికి చెందిన పూసలపాటి శాంతకుమారిపై అదే గ్రామానికి చెందిన దువ్వి సూరిబాబు అతడి భార్య జ్యోతి ఈనెల 8వ తేదీ రాత్రి ఇంటికి వెళ్లి ఆమెపై దౌర్జన్యం చేశారు. స్పందనలో తమపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ఆమెను చేతులతో కొట్టినట్టు బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

### కోడి పందేలపై దాడులు

**వేర్వేరు చోట్ల మొత్తం 9 మంది అరెస్ట్**

ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వేర్వేరుచోట్ల కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేసి మొత్తం తొమ్మిది మంది అరెస్ట్ చేశారు. ద్వారకా తిరుమల మండలంలోని కోడిగూడెంలో ద్వారకాతిరుమల పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2100 నగదు, రెండు కోడి కత్తులు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

**చల్లావారిగూడెంలో**

జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం గ్రామ శివారులో కోడి పందేలపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక కోడికత్తి, ఒక కోడి పుంజు, రూ.1230 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని హెచ్‌సి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



దుకాణంలో చెలరేగిన మంటలు

### హోమ్ నీడ్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం

ఏలూరు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు వన్‌టౌన్‌లోని బటర్‌ఫ్లై హోమ్ నీడ్స్ దుకాణంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి రామకృష్ణ తమ సిబ్బందితో వెళ్లి మంటలను అదుపుచేశారు. ఈలోపు సుమారు రూ. 3 లక్షల విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.



అగ్నికి ఆహుతైన వస్తువులు

### ఫిర్యాదు చేశానని దాడి



చికిత్స పొందుతున్న బాధితుడు బాలకోటయ్య

నూజివీడు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణం స్టేషన్ కోట ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల్లో సారా విక్రయాలు కొనసాగించడంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడంటూ ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలివి.. స్టేషన్‌తోటకు చెందిన బాధితుడు బాలకోటయ్య తమ ఇంటి నివాస ప్రాంతాల్లో సారా అమ్మకాలను ప్రశ్నించి పోలీసులకు ఫిర్యాదు చేయగా సారా విక్రేతలు ఐదుగురు తనపై కర్రలతో దాడి చేసినట్లు వాపోయాడు. నూజివీడు ఆసుప త్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితులను అదుపులోకి తీసుకుని తనకు రక్షణ కల్పించాలని బాధితుడు కోరుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

### బెల్టు షాపుపై దాడి.. ఒకరి అరెస్ట్

నూజివీడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి మద్యాన్ని విక్రయిస్తే సంబంధిత లిక్కర్ షాపులపై చర్యలు చేపడ తామని నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామానికి చెందిన దొండపాటి ఆంజనేయులును బెల్టు షాపు నిర్వహిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వారంతా 50 ఏళ్ల క్రితం కలిసి స్నేహం ప్రారంభించారు. నాటి స్మృతులను నెమరువేసుకుని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. తాడేపల్లిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1974లో ఎనిమిదో తరగతి చదివిన స్నేహితులు 1979లో పదో తరగతి పూర్తిచేసి పలు వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వారంతా వృత్తులు. ఉద్యోగాలకు విరమణ చేసే వయస్సులో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుల నాటి సంగతులు గుర్తుచేసుకున్నారు. సంతోషంగా ఆటపాటలతో గడిపారు. పూర్వ విద్యార్థులు పరిమి రామచంద్రరావు, పొలమోలు విజయ భాస్కరరావు, వీవీ దొరయ్య తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు.



# వేర్వేరు చోట్ల పది మంది జూదరుల అరెస్ట్

లింగపాలెం/పెదపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో వేర్వేరు చోట్ల పది మంది జూదరులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. లింగపాలెం మండలం బాధరాలలో పేకాట స్థావరంపై దాడి చేశామని ధర్మాజీగూడెం ఎస్‌ఐ కె.వెంకన్న తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

**వెంకటాపురంలో..**

పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీ వెంకటాపురంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామని పెదపాడు ఎస్‌ఐ కట్టా శారద సతీష్ తెలిపారు. నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

## పవన్‌కల్యాణ్‌ను కలిసిన రెడ్డిఅప్పలనాయుడు



ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఏలూరు జనసేన పార్టీ ఇన్‌చార్జి రెడ్డి అప్పల నాయుడు పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, పండ్ల బొకేను అందచేశారు. ఆర్టీసీ విజయవాడ రీజనల్ జోన్ చైర్మన్‌గా నియమించటంపై పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

జీలుగుమిల్లి, నవంబరు 10 : (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న గిరిజన ప్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ వైద్య ఆరోగ్య శాఖ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీరాములు దొర ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కోరారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న గిరిజన ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. ఐటీడీఏ పరిధిలో పీహెచ్‌సీల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమస్యల్ని సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. వెట్టి వెంకటేశ్వరావు, కోటం సువర్ణ, ఎం.వి.మహాలక్ష్మీ ఉన్నారు.

## శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



శిక్షణార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

ఏలూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ పరీక్షార్థుల కోసం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్ కేపీడీటీ హైస్కూలు ఆడిటోరియంలో నిర్వహిస్తున్న వంద రోజుల ఉచిత శిక్షణ తరగతులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అభ్యర్థులకు స్టేషనరీ, స్టడీ మెటీరియల్, మధ్యాహ్న భోజనం, అల్పాహారం తదితర సదుపాయాలను అందజేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట నిర్వాహకులు యు.రాంప్రసాద్, కె.కృష్ణారావు, హెచ్ఎం వి.మురళీకృష్ణ తదితరులున్నారు.

## సీపీఎం మండల కమిటీ ఎన్నిక

బుట్టాయగూడెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నూతన మండల కమిటీని 19 మందితో ఎన్నుకున్నారు. రెడ్డిగణపవరంలో ఆదివారం జరిగిన మండల మహాసభలో మండల కార్యదర్శిగా తెల్లం రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది. ఆయనతోపాటు ఐదుగురితో మండల కార్యదర్శి వర్గం ఎన్నికైంది. ఏజెన్సీ సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తామని, ఈ నెల 14న జరిగే మండల ఆఫీసు దర్నాలను జయప్రదం చేయాలని నూతన కమిటీ పిలుపు నిచ్చింది. నాయకులు పోలోజు నాగేశ్వరావు, కోర్స జలపాలు, ఎడతా వెంకటేష్, ఎం.నాగమణి, తామా ముత్యాలమ్మ, కారం భాస్కర్ తదితరులు ఉన్నారు.

## గోపిమూర్తికి ఏపీటీఎఫ్ మద్దతు

ఏలూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బి.గోపిమూర్తికి మద్దతునివ్వాలని ఆదివారం ఏలూరులో జరిగిన ఏపీటీఎఫ్-1938 జిల్లా సమావేశంలో తీర్మానించారు. వివరాలను సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నంబాబు, మోహన్ పత్రికలకు తెలిపారు. డిసెంబరులో జరుగనున్న ఉప ఎన్నికల్లో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాడే గోపిమూర్తికే మద్దతునివ్వాలని ఏకగ్రీవంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఇప్పటికే చేసిన తీర్మానం మేరకు ఏలూరు, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా శాఖలు నిర్ణయం తీసుకున్నాయని వివరించారు.

## కులగణనకు మద్ధతు ఇవ్వాలి

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రాజకీయ పార్టీలు కులగణనకు మద్ధతు తెలపాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్ రావు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగాను అన్ని విధాలా వెనుకబడి ఉన్న బీసీల సమగ్రాభివృద్ధికి జాతీయ స్థాయిలో జరగనున్న జనగణనతో పాటే రాష్ట్రంలోని 139 బీసీ కులాల గణనను చేపట్టాలన్నారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వానికి అన్ని రాజకీయ పార్టీలు మద్ధతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఆదివాసి గ్రామాల్లో పాఠశాలలకు షెడ్లు ఏర్పాటు

కుక్కునూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బండారుగూడెం, చీపుర్లగూడెం ఆదివాసి గ్రామాల్లో పాఠశాలకు పక్కా భవనాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పూరి గుడిసెల్లోనే పాఠశాలలు నిర్వహిస్తుడటంతో వర్షం వస్తే విద్యార్థుల నానా పాట్లు పడుతున్నారు. సామాజిక కార్యకర్త క్రాంతి ద్వారా తెలంగాణలోని ఖమ్మంలో విధులు నిర్వహిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ పుప్పాల రామారావు దృష్టికి తీసుకెళ్ళారు. అనంతరం చిరాగ్ ఫౌండేషన్ ద్వారా దాదాపు రూ.లక్ష వ్యయంతో రెండు షెడ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 45 మంది ఆదివాసీ పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. ఆదివారం పాఠశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిరాగ్ ఫౌండేషన్ సభ్యులు పురుషోత్తం, పుప్పాల రామారావు, పుప్పాలసాయి, గోపి, పాల్గొన్నారు.

# క్షత్రియులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



వన సమారాధనలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి వర్మ

జంగారెడ్డిగూడెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్షత్రియులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. వేగవరం సమీపంలో ఆదివారం జరిగిన అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా వ్యాపార వేత్త అల్లూరి సీతారామారాజు(ఆగరు సీతారామరాజు) పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనకు జంగారెడ్డిగూడెంతో మంచి సంబంధాలున్నాయని అన్నారు. తన తల్లి దండ్రులు ఇక్కడే నాలుగేళ్లున్నారని వారితో పాటు తాను కూడా ఉన్నట్లు తెలిపారు. వ్యాపారవేత్త పి.సుబ్రహ్మణ్యరాజు, ఎం.సోమరాజు, ఎస్.నానిరాజు, అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.రంగరాజు, ఎస్.రామచంద్రరాజు, కోశాధాకారి జి.భాస్కరరాజు పాల్గొన్నారు.

### మెట్ట ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా

కొయ్యలగూడెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం గవరవరంలోని బీజేపీ నాయకురాలు ఎస్ఆర్ఆర్పీ సుభద్రాదేవి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను కేంద్ర మంత్రి అవడానికి ఉమ్మడి జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషేనన్నారు. మాకు డెల్టాతో పాటు మెట్ట ప్రాంతం కూడా చాలా ముఖ్యమైందని ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన కలయికతోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పాటైందన్నారు. బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు బి.నిర్మల, నరసింహరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు బాబు, జనసేన సేన నాయకులు ఎం.శ్రీను, శోభన్‌బాబు, టీడీపీ నాయకులు గోపాలకృష్ణ, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన సంగీత విభావరి



ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెఎంహెచ్ఏ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి నిర్వహణలో సాగిన సంగీత ప్రదర్శనలు, సంకీర్తనావళి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. సర్వవాయిద్య సంగీత విద్వాన్ సయ్యద్ పాశ్చా సాహెబ్ 25వ వర్ధంతి సందర్భంగా ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సినీ నృత్య దర్శకులు కేవీ సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఏలూరు ఎమ్మెల్యే బడ్డేటి చంటి, మానవత విద్యా కమిటీ చైర్మన్ ఎ.నాగేశ్వరరావు ముఖ్య అతిథిలు హాజరయ్యారు. అనంతరం అకాడమి విద్యార్థులు సంగీత ప్రదర్శనలు, అనంతరం సంకీర్తనావళి సంగీత కచేరి మంత్రముగ్ధులను చేసింది. ఎస్‌పీఎస్ వాసు, వసుదా వాసు పర్యవేక్షించారు.

## బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలి




మాట్లాడుతున్న అంజనేయులు

ఏలూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్ బకాయిలను తక్షణం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని ఆదివారం ఏలూరులో జరిగిన పీఆర్టీయూ జిల్లా సమావేశంలో సంఘ అధ్యక్షుడు పి.ఆంజనే యులు డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరారు. నెలవారీ పదోన్నతులను పునరుద్ధరించాలని, హైస్కూళ్లలో ఉద్యోగ విరమ ణ చేసిన హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల ను భర్తీ చేయాలని, 'అపార్' నమోదులో అవరో దాలు, పదో తరగతి నామినల్ రోల్స్ తయారీలో ఎదురవుతున్న ఇబ్బందులకు తగిన పరిష్కార మార్గాలను, మార్గదర్శకాలను విడుదలచేయాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, ప్రసాద్, ధర్మారావు, లక్ష్మీభీమేశ్వరి, మురసలీన్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## గోవర్ధన్‌పై క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటాం

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల పై లేనిపోని ఆరోపణలు చేసేవారి పై పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందని, తెలుగుదేశం పార్టీ ఏలూరు రూరల్ మండలం క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ అధ్యక్షుడు ఎం.రవి తెలిపారు. కొల్లేరు నాయకుడు సైదు గోవర్ధన్ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు నంబూరి నాగరాజు పై అసత్య ఆరోపణలు చేయటాన్ని పార్టీ తీవ్రంగా ఖండించింది. తెలుగుదేశం పార్టీలో ఉంటూ పార్టీలోని నేతలను, కార్యకర్తల నిరాదరణ ఆరోపణలు చేయటం సరికాదన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించుకోవాలే తప్ప సోషల్ మీడియా వేదిక చేసుకుని ఇష్టానుసారం మాట్లాడితే పార్టీ సహించబోదన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాల మేరకు పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

## 13న కేంద్ర పింఛనర్ల సంక్షేమ శాఖ ఏడీ రాక

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పింఛన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజూ గుప్త ఈ నెల 13న యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలూరులోని ఆర్ఆర్‌పేట బ్రాంచ్‌ని సందర్శిస్తారని లీడ్ బ్యాంకు మేనేజరు నీలాద్రి తెలిపారు. పింఛనుదారులందరూ తమ జీవిత ధృవీకరణ పత్రాలను సమర్పించటానికి ఈ కేంద్రాన్ని సందర్శించవచ్చునన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను ప్రమోట్ చేస్తున్న దృష్ట్యా పింఛనుదారులు ఇక నుంచి వారి ఇంటి నుంచే లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించవచ్చన్నారు. పింఛన్‌దారులంతా డిజిటల్ మాధ్యమం ద్వారా సమర్పించేందుకు ఈ కేంద్రాన్ని సందర్శించాలని పింఛన్ శాఖ కోరినట్లు ఆయన తెలిపారు.

## బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకు రావాలని, బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నే భవనం వద్ద ఆదివారం జరిగిన రైతు సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలుచేసి ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించిదని ఆ విధంగానే నేటి కూటమి ప్రభుత్వం కూడా అమలు చేయాలన్నారు. రబీ సాగుపై స్పష్టమైన ప్రకటన చేయాలని గోదావరి, కృష్ణా డెల్టాలకు రబీ సాగు నీరు విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. వెంటనే ప్రాజెక్టు కమిటీల సమావేశాన్ని నిర్వహించి సాగునీరు విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. నాయకులు కె.భాస్కరరావు, జీవీ కృష్ణారావు, కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు సాయం



కొయ్యలగూడెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలని ప్రతి ఒక్కరు ఆదుకోవాలని మండల జనసేన అధ్యక్షు డు టి.రవి కోరారు. సరిపల్లె పంచాయతీ బొత్తప్ప గూడెంలో రెండు తాటాకిళ్ళు దగ్ధమై రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. జనసేన ఆధ్వర్యంలో ఆ రెండు కుటుంబాలకు రూ.25 వేలు విలువ కలిగిన నిత్యావసరాలు, వంట సామగ్రి, దుస్తులు ఆదివారం అందజేశారు. సర్పంచ్ టి.గోపి, జనసేన నాయకులు ఎ.సత్తిరాజు, వెంకటే శ్వరరావు, డి.మధు, రత్నకుమార్, ఎం.రాజేష్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు రవితేజ



పెదవేగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భోగాపురం గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ మెడంకి రవితేజ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆల్ ఇండియా ఉద్యోగ సివిల్ సర్వీస్ 2024-25 జాతీయస్థాయి క్రీడలలో పాల్గొనేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఈ నెల 6, 7 తేదీల్లో నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో రవితేజ 400 మీటర్ల రన్నింగ్ పోటీలో ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అలాగే 9వ తేదీ శనివారం విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టు ఎంపిక పోటీల్లోనూ రవితేజ మెన్ టీమ్‌కు ఎంపికయ్యాడు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రవితేజ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. ఎంపీడీవో పి.శ్రీనివాస్, భోగాపురం గ్రామ కార్యదర్శి బీహెచ్ ఎస్వీ కృష్ణంరాజు, సహచర సచివాలయ ఉద్యోగులు రవితేజను అభినందించారు.

## బ్రౌన్‌కు నివాళి



భీమడోలులో బ్రౌన్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

భీమడోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా సేవకు అవిరళ కృషి చేసిన సీపీ బ్రౌన్ సేవలు ప్రశంసనీయమని ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత ఎం.సుధాకర్ అన్నారు. భీమడోలు గ్రంథాలయంలో గ్రంథపాలకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం మాకిష్టం కార్యక్రమం జరిగింది. సీపీ బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సాహిత్య రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. చిన్నారులు సామూహిక పుస్తక పఠనం చేశారు. విద్యార్థులు పాల్గొన్నారు.

● పెదవేగి : విజ్ఞానదాయకమైన పుస్తకం ఒక మంచి స్నేహితుడని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు టి.అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ పుస్తక పఠనం వలన కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. మంచి పుస్తకం వెంట ఉంటే మన క్షేమం కోరే మిత్రుడు మనతో ఉన్నట్లేనన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి రావాలన్నారు.

## జనసేనలో భారీ చేరికలు



క్యాంపు కార్యాలయంలో జనసేనలో చేరిన నాయకులు

ఉంగుటూరు, నవంబరు 10 : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయలో గణపవరం మండలం మొయ్యేరు గ్రామస్థులు 30 మంది జనసేనలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సమక్షంలో ఆదివారం చేరారు. వారందరికి పార్టీ కండువా కప్పి ధర్మరాజు ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సొసైటీ అధక్షుడు అశోక చక్రవర్తి సమక్షంలో చేరడం జరిగింది. అనంతరం నారాయణపురంలో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో ఎమ్మెల్యే ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : చినవెంకన్న ఆలయంలో స్వామి, అమ్మవార్లను ఎమ్మెల్యే ధర్మరాజు దర్శించుని తులాభారం తూగారు. తన బరువున్న పటిక బెల్లం స్వామికి సమర్పించారు.

## 15న శైవ క్షేత్ర దర్శన బైక్ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతూన్న రామదండు సభ్యులు

దెండులూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల పరిరక్షణ అభివృద్ధి, సంక్షేమానికి రామ దండు పేరుతో నియోజకవర్గంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నమని దెండులూరు రామ దండు కార్యనిర్వాహక సభ్యులు ఎస్.నూకరాజు, ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.రాజాబాబు అన్నారు. బీఆర్ నర్సింగ్ కాలేజీ అవరణలో ఆదివారం రామదండు సభ్యులు నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన నియోజకవర్గంలోని ఐదు ప్రసిద్ధి చెందిన శివాలయాలను బైక్ ర్యాలీ ద్వారా సందర్శిస్తామన్నారు. వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. సభ్యులు రాజేష్ తులసీదాస్ పాల్గొన్నారు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏలూరు మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు రెడ్డి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మిక హక్కులను కాలరాస్తోందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తోందని మండిపడ్డారు. ఉపాధిభద్రతతో కూడిన చట్టం తీసుకురావాలని, ఆ చట్టం వచ్చేవరకు కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వర్కింగ్ అధ్యక్షుడు రెడ్డిఅప్పలనాయుడు మాట్లాడుతూ కార్మికులంతా ఐఖ్యంగా ఉండాలన్నారు. బి.వెంకట్రావు, వై.శ్రీనివాసరావు, కె.వీరత్నం, జి.రమణ, కె.అప్పారావు, విజయ్, కొండ, చిట్టిశివ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంచనమాల విగ్రహావిష్కరణ

ఏలూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రముఖ గైనకాలజిస్టు, సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలుకు 29 ఏళ్ల కరస్పాండెంట్‌గా వ్యవహరించిన దివంగత డాక్టర్ కోయ కాంచనమాల విగ్రహాన్ని ఆదివారం సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఇంద్రకుమార్ ఆవిష్కరించారు. కాంచనమాల కుమారులు, ఎన్ఆర్ఐలు వైద్యులు శ్రీనివాస్, మధుసూదనరావు, కుమార్తె పద్మజ అన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే డీవీ బాలవర్ధనరావు, సీఆర్ఆర్ పాలకవర్గ ఉపాధ్యక్షుడు డాక్టర్ వీవీ బాలకృష్ణారావు, పాలకవర్గ కమిటీ సభ్యులు వి.రఘుకుమార్ పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు మరువలేనివి



కుక్కునూరులో అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్న సిబ్బంది

కుక్కునూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో విధి నిర్వహణలో భాగంగా అమరవీరులైన వారికి సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం కుక్కునూరు అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించారు. అటవీ రేంజ్ అధికారి కృష్ణకుమారి జ్యోతిప్రజ్వలన చేసి నివాళులర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 23మంది విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయారన్నారు. వీఆర్వో కేసరి, సిబ్బంది పెరుమాళ్ళు జోగారావు పాల్గొన్నారు.

● పోలవరం : అటవీ శాఖ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అటవీక్షేత్రాధికారి ఎస్‌కే వలీ అన్నారు. అటవీ శాఖ అమరవీరుల దినోత్సవాన్ని స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. విధి నిర్వహణలో అశువులు బాసిన అటవీ శాఖ అమరవీరులకు నివాళుర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, నినాదాలు చేశారు. ఎస్‌కే వలీ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల పోలీసులను, అటవీ శాఖ అధికారులను ముప్పుతిప్పలు పెట్టిన కరడుకట్టిన గంధపుచెక్కల స్మగ్లర్ వీరప్పన్ క్రూరత్వానికి బలైన రాజమండ్రి అటవీ శాఖ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్, అమరులైన మరెంతో మంది అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అటవీ శాఖ గౌరవప్రతిష్టలు పెంచారన్నారు. డీఆర్వోలు ఎ.సూరిబాబు, మీనాక్షి, గోపికుమార్, ఎఫ్ఎస్‌వోలు కె.సోమరాజు, మధుకర్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



బుట్టాయగూడెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మన్యం ఏజెన్సీలో వేంచేసిన గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.

## పట్టిసీమ శివ క్షేత్రాన్ని దర్శించిన జైళ్ల శాఖ డీఐజీ



డీఐజీకి ఆలయ జ్ఞాపిక అందిస్తున్న అర్చకులు

పోలవరం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివ క్షేత్రాన్ని ఆంధ్రా రీజియన్ జైళ్ల శాఖ డీఐజీ ఎం.రవికిరణ్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. వారికి సిబ్బంది వెంకట్రాజు తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డీఐజీ దంపతులకు అర్చకులు ఆలయ జ్ఞాపికతో కండువాలతో సత్కరించారు. స్థానిక పోలీసులు మురళీకృష్ణ, డీఐజీ రక్షణ సిబ్బంది ఉన్నారు.

## రెడ్డిఅప్పలనాయుడికి అభినందనల వెల్లువ

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విజయవాడ రీజనల్ జోన్ చైర్మన్‌గా నియమితులైన రెడ్డిఅప్పలనాయుడిని ఆదివారం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం ప్రకటిస్తూ పార్టీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. రెడ్డిఅప్పలనాయుడు మాట్లాడుతూ ఏలూరులో తానుచేసిన సుదీర్ఘపోరాటానికి ఫలితంగా ఆర్టీసీ రీజనల్ జోన్ చైర్మన్‌గా నియమితులు అయ్యారని నాయకులు హర్షం ప్రకటించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, మోరువెంకట నాగరాజు, నిమ్మల జ్యోతికుమార్, వి.శ్రావణ్‌కుమార్, ఎం.రాజేష్, మార్కెట్‌యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆర్టీసీ, వివిధసంఘాల కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందించారు.

## రాకేష్ నియామకంపై హర్షం

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య, వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూంటీ రాకేష్‌ను నియమించటంపై ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు మద్దుల జనార్దన్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

## దుర్గా ప్రతాప్‌కు నివాళి

ఉంగుటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అశువులు బాసిన చేబ్రోలు గ్రామ యువకుడు దుర్గా ప్రతాప్ సేవలు అనిర్వచనీయమని పలువురు మాజీ సైనికులు పేర్కొన్నారు. చేబ్రోలులో దివంగత మాజీ సైనికుడు దుర్గా ప్రతాప్‌కు ఆదివారం నివాళి అర్పించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సైనికులు డి.శ్రీనివాస్, బి.రామారావు, శివ ప్రసాద్, బి.రమేష్, పి.ప్రసాద్, ఎ.గంగాధరం, దుర్గా ప్రతాప్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డీఏ విడుదల చేయాలి

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు డీఏ విడుదల చేసి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దసరా, దీపావళి పండుగకు డీఏ ప్రకటిస్తారని ఆశగా ఎదురుచూశారని, కాని ప్రభుత్వం ఏమీ ప్రకటించకపోవడంపై నిరాశకు గురయ్యారన్నారు. సోమవారం నుంచి జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగుల సమస్యలపై చర్చించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటా..



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పవర్‌పేట క్యాంపు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. తంగెళ్ళమూడికి చెందిన బాలషన్మాక్ కారు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. తల్లిదండ్రులకు ఆల్‌వేజ్ హెల్ప్‌ఫర్ ఆదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.25,500లను చంటి చేతుల మీదుగా అందజేశారు. ఆపరేషన్‌కు రూ.10 లక్షలు ఖర్చవుతుందని ప్రభుత్వం తరపున ఆదుకోవడానికి ప్రయత్నిస్తామన్నారు. సీహెచ్.వెంకటరత్నం, బి.కిశోర్, బి.శ్రీనివాస్, ఏ.తిరుపతి పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

లింగపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు తప్పని సరిగా అందుబాటులో ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి అన్నారు. ధర్మాజీగూడెం, లింగపాలెం, మఠంగూడెం, సింగగూడెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్లు మండల పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని ఆయన సూచించారు. డీటీ నాగబాబు, ప్రసాద్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## వాహనదారులకు జరిమానాలు

పెదపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెదపాడు ఎస్సై కె.శారద సతీష్ అన్నారు. గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేసి పలు వాహనాలకు జరిమానాలు విధించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణపాయం నుంచి తప్పించుకోవచ్చునన్నారు.

● లింగపాలెం : మండలంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న అవగాహన కల్పించారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు.

## 23న ఏఐటీయూసీ సమావేశం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అయిన ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా స్థాయి సమావేశం ఈ నెల 23న జంగారెడ్డిగూడెంలో జరుగుతుందని యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.విఘ్నేష్ తెలిపారు. రామచంద్రరావుపేటలోని ఎస్ఆర్-2 వద్ద ఆదివారం మునిసిపల్ కార్మికులకు సమావేశ వివరాలను వివరించారు. ప్రభుత్వ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు రెడ్డిశ్రీనివాస డాంగే, మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడారు. కోశాధికారి బి.నారాయణరావు, సహాయ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## 18న సచివాలయాల వద్ద ధర్నా

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని సీపీఐ ఏలూరు నగర కార్యదర్శి యు.హేమశంకర్ డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సమావేశాన్ని ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తిభవనం వద్ద ఎ.లక్ష్మీ ఇందిర అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 18న గ్రామవార్డు సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించి అర్జీలను ప్రభుత్వానికి ఇస్తామని చెప్పారు. ధర్నా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి జి.వరప్రసాద్, నాయకులు బి.కనకదుర్గారావు, టి.శ్రీను ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై పోరాడతాం

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పై పోరాడతామని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ యు.దేవి ప్రసాద్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన మాలల సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నా మాలలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో డిసెంబర్ 15న హలో మాల చలో అమరావతి కార్యక్రమాన్ని లక్షలాది మాలలతో నిర్వహిస్తున్నామన్నారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు, ఎస్సీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌కుమార్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పి.రమేష్, డాక్టర్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం ప్రజాపోరు యాత్ర



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం వెంకటాపురం పంచాయతీ పరిధిలో 19వ డివిజన్‌లో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యల వినతులు స్వీకరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిమిలి ఎన్నికల విధానం అమలైతే రాష్ట్రాల్లో ఉండే ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సీపీఎం నగర కార్యదర్శి పి.కిశోర్, సీపీఎం నాయకురాలు ఎ.శ్యామలరాణి, కె.లెనిన్, వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, తదితరులు పాల్గొన్నారు.




# కొల్లేరుకు విదేశీ చుట్టాలు

కైకలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొల్లేరు సరస్సుకు విదేశీపక్షులు రాక మొదలైంది. మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరుకు ప్రతి సంవత్సరం వివిధ జాతులకు చెందిన పక్షులు వేల కిలోమీటర్లు ప్రయా ణించి చేరుతుంటాయి. కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీరప్రాంతాల నుంచి శీతాకాలపు అతిథులుగా వచ్చి పర్యాటకులను ఆకర్షిస్తాయి. కొల్లేరు సరస్సులో చేపలను వేటాడి ఆహారాన్ని తీసుకుంటాయి. సమీప ప్రాంతాల నుంచి పుల్లలు తెచ్చుకుని గూళ్లు కట్టుకుంటాయి.


ఐరన్ స్టాండ్‌లపై నివాసం

పెయింటెడ్ స్టాక్, పెలికాన్‌తో పాటు ఎర్రకాళ్ళ ఉలసలు, తెల్ల, నల్ల కంకణాల పిట్టలు, జనకబాతులు, నీటికోళ్ళు, ఊది చెంచుకోడి, పెద్ద ఉల్లంకి పక్షులు సంతానో త్పత్తి కోసం కొల్లేరుకు వస్తుంటాయి.

## పెలికాన్ (గూడబాతు)



పెలికాన్ పక్షి కొల్లేరు సరస్సులో రారాజులా కనిపిస్తూంటాయి. అక్టోబర్ నుంచి మార్చినెలల మధ్యకాలంలో ఈ జాతిపక్షులు కొల్లేరుకువచ్చి గుడ్లుపెట్టి పొదుగుతుంటాయి. ఆడపక్షి గుబురుగా ఉండే చెట్ల పొదల్లో, అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన కృత్రిమ ఇనుపస్టాండ్లపై గుడ్లు పెట్టి పొదుగుతుండగా మగపక్షి సరస్సులో సంచరించి ఆహారాన్ని తీసుకువస్తూ ఉంటుంది. సుమారు 2 నుంచి 6 కేజీల బరువు ఉండే ఈ పక్షి గోధుమ వర్ణంలో ఉండి పొడవైన ముక్కు, దానికింద సంచి వంటి భాగం ఉండి అరకిలో నుండి కేజీ బరువు గల చేపను గుటు క్కున మింగేస్తుంది. ప్రతి సంవత్సరం వేలాది పెలికాన్స్ తరలిరావడంతో అధికారులు ఆటపాక పక్షుల కేంద్రానికి పెలికాన్ ప్యారడైజ్‌గా పేరు పెట్టారు.

## పెయింటెడ్ స్టాక్ (ఎర్రకాళ్ళ కొంగ)



పెయింటెడ్ స్టాక్ పక్షి ఒంటిపై ముద్దులొలికే రంగులు ఉంటాయి. గులాబీ, నలుపు రంగులు పెయింటింగ్ వేసినట్లు కనిపిస్తాయి. కాళ్లు, ముక్కు ఎర్రగా ఉంటాయి. ఈపక్షి పిల్ల దశలో పూర్తిగా నలుపు రంగులో కని పిస్తుంది. వయసు పెరిగే కొద్దీ రంగులద్దుకుంటుంది. ముళ్ళు ఉన్న చెట్లపై ఎక్కువగా గూడు ఏర్పాటు చేసుకుంటాయి. ఉత్తరభారతదేశం నుంచి శీతాకాలం ప్రారంభమైన తరువాతనే దక్షిణాది ప్రాంతాలకు వలసలు వస్తాయి. వీటి రంగులు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.

### ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు..

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..
- కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాలులో సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్
- అభ్యర్థితోపాటు ఐదుగురికే అనుమతి
- నేడు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్న కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం అవుతుంది. కాకినాడ కలెక్టరేట్ కోర్టుహాలులో ఈ మేరకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. కలెక్టరేట్ ప్రాంగణంలోకి మూడు కార్లకు అనుమతి ఇస్తారు. కోర్టుహాలులో నామినేషన్ సమర్పించేందుకు అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఇస్తారు. అభ్యర్థులకు ఉండే సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ విడుదల చేస్తారు. నామినేషన్ల పరిశీలనకు ప్రత్యేక అధికారుల బృందాన్ని నియమించారు. ఈనెల 18వతేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 19న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈనెల 21న నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుంది. డిసెంబరు 5న పోలింగ్, డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

### మొత్తం ఓటర్లు 16,316 మంది

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 16,316మంది ఉన్నారు. మొత్తంగా 116 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

### ఆరు జిల్లాల నుంచి కాకినాడకే కావాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆరు జిల్లాల నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు రావాలి. దీనిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి.

### ఎమ్మెల్సీ మృతి చెందడంతో ఉప ఎన్నిక

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికైన పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది డిసెంబరు 15న రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో ఈ ఉపఎన్నిక జరుగుతుంది. 2021లో జరిగిన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జీ ఎన్నికయ్యారు. వాస్తవానికి ఆయన పదవీకాలం 2027, మార్చి 29వతేదీ వరకు ఉంది. రోడ్డుప్రమాదంలో మృతిచెందడంవల్ల ఉపఎన్నిక అనివార్యమైంది.

## కొత్తగా మరికొందరికి ఉత్తమ పురస్కారాలు

ఏలూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ఇప్పటికే కొంతమంది ఎంపిక కాగా తాజాగా ఇంటర్, సాంకేతిక, ఉన్నత విద్య శాఖల నుంచి ఉత్తమ అధ్యాపక పురస్కారాలకు ఎంపికైనవారి జాబితాలను తాజాగా విడుదల చేశారు. ఆ ప్రకారం ఇంటర్ విద్యలో నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ జూనియర్ లెక్చరర్ సీహెచ్.వి.వి.రామచంద్రరావు, తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ పి.వి.నాగార్జున ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. సాంకేతిక విద్యలో తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ సివిల్ ఇంజనీరింగ్ లెక్చరర్ డి.శ్రీకాంత్, ఉన్నత విద్యలో యూనివర్సిటీ లెక్చరర్స్ విభాగం నుంచి వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ వెజిటబుల్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ సయ్యద్ సదరున్నీసా ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. కాగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కా రాలకు ఎంపికైన ఉపాధ్యాయులకు, అధ్యాప కులకు సోమవారం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా విజయవాడలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించే జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి పురస్కారాలను అందించాల్సి ఉంది. అయితే ఉభయ గోదావరి జిల్లాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎంపికైన 27 మందికి (పాఠశాల విద్య నుంచి 14 మంది, ఇంటర్, సాంకేతిక, ఉన్నత విద్యశాఖల నుంచి 13 మంది) సోమవారం అవార్డులివ్వడం లేదని, తిరిగి ఈ పురస్కారాలను ఎప్పుడు ఇచ్చేదీ అధికారికంగా ఇంకా ప్రకటించాల్సి ఉందని ఏలూరు జిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదివారం ధ్రువీకరించారు.

# నిరుపయోగంగా జనరేటర్

### పట్టించుకోని రెవెన్యూ అధికారులు

మునునూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముసునూరు తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ జనరేటర్ కొన్నేళ్ళుగా నిరుపయోగంగా ఉండటంతో శిథిలావస్థకు చేరుతోంది. విద్యుత్ లేకపోయిన కార్యాలయంలో కార్యకలాపాలకు అటంకం ఏర్పడకుండా ఉండేందుకు సుమారు పదేళ్ల క్రితం ఈ జనరేటర్ ఏర్పాటు చేశారు. అయితే ఏడేళ్ల నుంచి ఈ జనరేటర్‌ను రెవెన్యూ అధికారులు వినియోగించకుండ వదిలివేశారు. దీంతో జనరేటర్ శిథిలావస్థకు చేరింది. ముసునూరులో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండటంతో వివిధ రకాల పనులపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలు సైతం కరెంట్ పోతే గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. కరెంట్ లేకపోయిన తహసీల్దార్ కార్యా లయంలో నిరంతరం పనులు జరిగేందుకు ఏర్పాటు చేసిన జనరేటర్‌ను మూలన పడవేడంపై మండల ప్రజలు అధికారుల పని తీరుపై మండిప డుతున్నారు. ఇప్పటికైన జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీలార్ శర్మను వివరణ కోరగా, జనరేటర్ పరిస్థితిని పరిశీలించి త్వరలో వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

## కార్యకర్తలకు అండగా టీడీపీ


టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

ముసునూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని యువనేత ఉప్పలపాటి గణేష్ అన్నారు. గోపవరంలో ఆదివారం టీడీపీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. గణేష్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్త సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ 5 లక్షలు ప్రమాదబీమాను ప్రకటించి కుటుంబానికి టీడీపీ ఆర్థిక భరోసా ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వాన్ని తీసుకుకోవాలని ఆయన కోరారు. నాయకులు వడ్లపట్ల మురళీ, సాయిల అనిల్, కర్రా ఏసుపాదం, కొసరాజు సత్యనారయణ, ఆర్.మునియ్య పాల్గొన్నారు.

## కారు చౌకగా కార్పొరేట్ పరం


సమావేశంలో మాట్లాడుతున్న రవి


నూజివీడు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. నూజివీడు మండల సీపీఎం ఆరోవ మహాసభను పల్లెర్లమూడిలో పి.సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు కష్టం కలిగించే వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయాలని చూస్తున్నారని, ఇటు కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు నష్టం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, నాయకులు శ్రీనివాస్, హనుమాన్‌లు, తదితరులు పాల్గొన్నారు.


అటపాకలో ట్రైసైకిళ్ల పంపిణీ

## కార్తీక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకలు

కైకలూరు/ఆకివీడు: ఐక్యతకు ప్రతీకలు కార్తీక వనసమారాధనలని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. ఏలూరు జిల్లా అటపాక పక్షుల విహార కేంద్రం వద్ద ఆదివారం జోన్ చైర్‌పర్సన్లు మద్రివాడ శ్రీనివాసరావు, వేగేశ్న వెంకట కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆకివీడు లయన్స్ క్లబ్ జోన్ సోషల్ మీట్ కార్తీక వనసమారాధన నిర్వహించారు. దివ్యాంగుడికి మూడు చక్రాల రిక్షా, విద్యార్థినులకు సైకిళ్ళు, ఆకివీడు శాఖా గ్రంథాలయానికి సౌండ్ సిస్టమ్ అందచేశారు. లయన్స్ ప్రముఖులను సన్మానించారు. లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు డాక్టర్ ఎంవీఎస్ సూర్యనారాయణరాజు, ఈపూరి సత్యనారాయణ, చిలుకూరి కృష్ణంరాజు, లయన్స్ జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్వీఎస్ సూర్యనారాయణరాజు, దాట్ల రామరాజు, పిన్నమరాజు మురళీరాజు, గొట్టుముక్కల బాబు, ముదుండి సుబ్బరాజు పాల్గొన్నారు.

## ఫిర్యాదిపై దాడి



నూజివీడు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణం స్టేషన్ కోట ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల్లో సారా విక్రయాలు కొనసాగించడంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడంటూ ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే స్టేషన్‌తోటకు చెందిన బాధితుడు బాలకోటయ్య తమ ఇంటి నివాస ప్రాంతాల్లో సారా అమ్మకాలను ప్రశ్నించి పోలీసులకు ఫిర్యాదు చేయగా సారా విక్రేతలు ఐదుగురు తనపై కర్రలతో దాడి చేసినట్లు వాపోయాడు. నిందితులను అదుపులోకి తీసుకొని తమకు రక్షణ కల్పించా లని బాధితుడు కోరుతున్నారు.

## ఎస్సీవర్గీకరణపై పోరాడతాం

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పై పోరాడతామని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ యు.దేవి ప్రసాద్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన మాలల సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 15న హలో మాల చలో అమరావతి కార్యక్రమాన్ని లక్షలాది మాలలతో నిర్వహిస్తున్నామన్నారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు, ఎస్సీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌కు మార్, తదితరలు పాల్గొన్నారు.

## ఒరిగిన స్తంభాలు నిలబెట్టారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




ముసునూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అల్లుకుపోయిన తీగలు.. ఒరిగిపోతున్న స్తంభాలు అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. విద్యుత్ లైన్‌లకు అల్లుకుపోయిన తీగలను తొలగించారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలను ఆదివారం ఇన్‌చార్జి ఏఈ వీరబాబు పర్యవేక్షణలో ట్రాన్స్‌కో సిబ్బంది ముసునూరు నుంచి వలసపల్లి ప్రధాన రహదారి ప్రక్కన ఒరిగిపోయి ప్రమాదకంగా ఉన్న ఆరు 11కేవీ విద్యుత్ లైన్ స్తంభాలకు సపోర్ట్ స్తంభాలను వేసి నిలబెట్టి సమస్య పరిష్కారించారు. ఈ సమస్యను పలుమార్లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పట్టించుకోలేదని, ఆంధ్రజ్యోతి కథనంతో పరిష్కామైందని రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## సమన్వయంతో నామినేటెడ్ పదవుల కేటాయింపు

### ఎమ్మెల్యే డాక్టర్ కామినేని


కూటమి నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులను వివాదాలకు తావులేకుండా కూటమి నాయకులందరూ సమన్వయంతో తీసుకునేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు మండలం వరహాపట్నంలో ఎమ్మెల్యే నివాసం వద్ద కూటమి నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో కూటమి నేతలంతా సమన్వయంతో కలిసి గట్టుగా పనిచేసి ఆరువేల పైచిలుకు ఓట్లు నమోదు చేశారని అలాగే మరికొంత సమయం ఉన్నందున గతంలో ఉన్న ఓట్ల సంఖ్యను దాటించేందుకు కృషి చేయాలన్నారు. నీటి సంఘాల ఎన్నికల నిర్వహిస్తోందని అలాగే మార్కెట్‌యార్డ్, వ్యవసాయ సహకార సంఘాల్లో మూడు పార్టీలు సమన్వయంగా పదవులను పొందేలా చూస్తానన్నారు. బీజేపీ సభ్యత్వాల నమోదు బాగా చేశారన్నారు. ఇప్పటికే ప్రభుత్వం చేపడు తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కూటమి నేతలు కృషి చేయాలన్నారు. కూటమి నేతలు వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్, తాడినాడ బాబు, పెన్మెత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, చల్లగుల్ల శోభనాద్రిచౌదరి, నారగాని వీరవెంకట నాగేశ్వరరావు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, చెన్నంశెట్టి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ముదినేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదగొన్నూరులో పల్లె పండుగ వారోత్సవాల్లో ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన రూ.17.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ పనులకు సర్పంచ్ తాడంకి శిరీష భూమి పూజ చేశారు. గ్రామంలోని అన్ని అంతర్గత రహదారులను దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్టు సర్పంచ్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి గిరిజ, ఎన్‌డీఏ నాయకులు వీరంకి వెంకటేశ్వరరావు, యార్లగడ్డ గంగయ్య, తాడంకి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ శిరీష

## రెయిలింగ్స్ విరిగి ఆరేళ్లు గడిచినా..

ముదినేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి - బంటుమిల్లి ప్రధాన రహదారిలో పెదలంక మేజర్ డ్రెయిన్‌పై ఉప్పరగూడెం వద్ద ఉన్న వంతెన రెయిలింగ్స్ విరిగి ఆరేళ్లు గడిచినా నేటికీ ఆర్ అండ్‌బీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆ వంతెనపై నుంచి వెళ్తా ద్విచక్ర వాహనాలు, పశువులు డ్రెయిన్‌లో పడిపోయిన ఘటనలు జరిగాయి. 2018 నవంబరు 8న ఒక లోడు లారీ ఢీ కొనటంతో ఈ వంతెనపై ఒక పక్క సగభాగం రెయిలింగ్స్ విరిగి కూలిపోయాయి. అప్పట్లో ఆర్ అండ్‌బీ అధికారులు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని కన్నెత్తి కూడా చూడలేదు. ఈ విషయాన్ని బందరు డివిజన్ ఆర్ అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధుల కొరత వల్ల ఏమీ చేయలేమని చెప్పే వారే తప్ప రెయిలింగ్స్ విరిగిన చోట వంతెనపై ప్రమాద స్థితిని నివారించేందుకు తాత్కాలిక చర్యలు కూడా చేపట్టలేదు. గోడ నిర్మించినా రూ.50 వేలు కంటే ఎక్కువ ఖర్చు కాదని ఒక ఆర్ అండ్‌బీ అధికారి చెప్పారు. ఆ మాత్రం నిధులను కూడా ఆర్ అండ్‌బీ శాఖ మంజూరు చేయకపోవడంతో విరిగిన రెయిలింగ్స్ ఇప్పటికీ అలాగే వేలాడుతున్నాయి.


పెదలంక డ్రైన్‌పై ఉప్పరగూడెం వద్ద విరిగిన వంతెన రైలింగ్

## గ్రంథాలయాల పని వేళల మార్పు

### ఉద్యోగినుల పాట్లు



ముదినేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల పని వేళల మార్పులతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారు. విధి నిర్వహణలో అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రేడ్-3 గ్రంథాలయాల లైబ్రేరియన్లు మరింత ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రంథాలయాలు ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేసేవి. ఇప్పుడు సాయంత్రం సమయంలో పని వేళలను 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మార్చారు. గ్రంథాలయాలను రెండో పూట తెరిచే సమయాన్ని ఒక తగ్గించి మూసే సమయాన్ని గంట పెంచారు. పని వేళలు సాయంత్రం పూట గతంలోను, ఇప్పుడు మూడు గంటలే అయినప్పటికీ గ్రంథాలయాల పని వేళలు రాత్రి ఏడుగంటల వరకు పొడిగించడం ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా మహిళా లైబ్రేరియన్లకు ఇబ్బందులు పెరిగాయి. రాత్రి ఏడు గంటలకు లైబ్రరీ మూసి అన్నీ సర్దుకుని ఇళ్లకు వెళ్లే సరికి స్థానికులకైతే 8 గంటల సమయమవుతోంది. స్థానికేతర మహిళా ఉద్యోగులకు ఇళ్లకు వెళ్లేందుకు రాత్రి 9 నుంచి 10 గంటల సమయం అవుతుంది. దీంతో మహిళా లైబ్రేరియన్లు కుటుంబబ వ్యవహారాలు చూసుకోవడం, పిల్లల పోషణ విషయంలో సమస్యలు ఎదుర్కొంటు న్నారు. వాస్తవానికి ఎక్కువ శాతం మంది కాంట్రాక్టు బేసిస్‌పై ఉద్యోగాలు చేసేవారే. తక్కువ జీతం తీసుకుంటూ స్థానికంగా అద్దెలు భరించలేక దూర ప్రాంతాల్లో సొంత ఇళ్లల్లో ఉంటూ నిత్యం వస్తున్నారు. అటువంటి మహిళా ఉద్యోగులు పని వేళల మార్పు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత పాఠకులు గ్రంథాలయాలకు రావడం తక్కువే. పని వేళలను గతంలో మాదిరిగా మార్చాలని పలువురు ఉద్యోగాలు కోరుతున్నారు. మండలంలో ముదినేపల్లి, గురజలో గ్రంథాలయాలు ఉన్నాయి. రెండుచోట్ల కూడా మహిళలే లైబ్రేరియన్‌లుగా పనిచేస్తున్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం

నూజివీడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి మద్యాన్ని విక్రయిస్తే లిక్కర్‌షాపుల పై చర్యలు చేపడతామని నూజివీ డు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు ఎక్సైజ్‌స్టేషన్‌పరిధిలో ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామానికి చెందిన దొండపాటి అంజనేయులును అదుపులోకి తీసు కుని అతనివద్ద నుండి ఆరు మద్యం సీసాల ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 సంవత్స రాల్లోపు వారికి మద్యం విక్రయించినా, బెల్టు షాపులకు మద్యాన్ని సరఫరా చేసినా సహించేది లేదన్నారు. సరఫరా చేసిన దుకాణదారుల పై చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## 120 మందికి కంటి పరీక్షలు



చాట్రాయి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండలో సీఎస్ఐ చర్చి పాస్టర్ పాల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి 120 మందికి పరీక్షలు చేశారు. విజయవాడ శ్రీశార్వాణి కంటి హాస్పటల్ వైద్య నిపుణుడు డాక్టర్ విశ్వనాథం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులు

నూజివీడు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా నూజివీడు మండల స్థాయిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పరీక్షలను నిర్వహించినట్లు నూజివీడు డీవైఈవో సేవ్యా తెలిపారు. మొత్తం 113 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా మీర్జాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన గరికపూడి త్రివేణి ప్రథమ స్థానం సాధించగా బెజవాడ హర్షిణేష్, నూజివీడు జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన కవితలు ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. నూజివీడు ఎస్సార్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన నరసింహ మూడో స్థానంలో నిలిచినట్లు ఆయన తెలిపారు.

## మలుపుల్లో జంగిల్ క్లియిరెన్స్



ముసునూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ప్రధాన రహదారుల్లో ఉన్న ప్రమాదకరమైన మలుపుల్లో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నూజివీడు డీఎస్పీ, సీఐల ఆదేశాలతో ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి అన్నారు. ఆదివారం ఎస్ఐ ఆధ్వర్యంలో ముసునూరు-చింతలవల్లి ఆర్అండ్‌బి రహదారిలో ప్రమాదకర మలుపు వద్ద మార్జిన్‌లో ఉన్న జంగిల్‌ను లెవిల్ ట్రాక్టర్‌తో తొలించారు. దీంతో ఎదుగా వచ్చే వాహనాలు సైతం కపించడంతోపాటు బారీ వాహనాలు రోడ్డు మార్జిన్‌లో నుంచి వెళుతుండటంతో వాహనదారులు పోలీసుల పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో రహదారుల్లో ఉన్న ప్రమాదకర మలుపుల్లో జంగిల్ తొలించేలా చర్యలు తీసుకుంటామాని ఎస్ఐ తెలిపారు.

## టీడీపీ సభ్యత్వాల నమోదు వేగవంతం చేయాలి

కలిదిండి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వాల నమోదు వేగవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పోక ల జోగిరాజు అన్నారు. కలిదిండిలో ఆదివా రం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో టీడీపీ సభ్యత్వాల నమోదు మందకొడిగా సాగుతోందన్నారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ సభ్య త్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యంపై అవగాహన కల్పించాల న్నారు. అందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు.

## నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితా ప్రదర్శన

కలిదిండి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితాను తహసీల్దార్ రామకృష్ణ ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 14 నీటి సంఘాల ఎన్నికల జాబితా ను గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శిస్తామ న్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు తప్పులు ఉంటే దరఖాస్తుల రూపంలో అందించాల న్నారు.

## రహదారుల మరమ్మతులకు చర్యలు

కలిదిండి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లంక గ్రామాల రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఆర్ అండ్‌బీ డీఈఈ భాస్కర్, ఏఈఈ అరవింద్ తెలిపా రు. ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో 'రోడ్డా... చెరువా' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గుర్వాయిపాలెం - పెదలంక రహదారి మరమ్మతులకు రూ.80 లక్షలు, మద్వానిగూడెం - మట్ట గుంట రహదారి మరమ్మతులకు రూ.70 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు చేపడతామన్నారు.

## సహజకవికి సన్మానం


రాజమండ్రిలో బెనర్జీని సన్మానిస్తున్న ప్రముఖులు

కైకలూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కైకలూరుకు చెందిన సహజకవి దండే బెనర్జీని ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో గోదావరి కవనోత్సవం-141 జాతీయ శతాధిక కవి సమ్మేళనంను నిర్వహించారు. ఈ సమ్మేళనంకు కైకలూరు నుంచి సహజకవిగా దండే బెనర్జీ పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో బెనర్జీ తను రాసిన కవితలను వినిపించడంతో జ్ఞాపికతో అందజేసి ప్రత్యేక అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కైకలూరుకు చెందిన పలువురు ఘనంగా అభినందించారు.